



RNI NO: APTEL/25/A4894

# ఉషశ్రీ USHASRI
తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 90 | విజయవాడ | ఎడిటర్ : ఇలిపిల్ల మోహన్ | బుధవారం 10 - 06 - 2026 | పేజీలు : 08 | వెల : రూ.2/-

Published From : Visakhapatnam Vijayawada Guntur Tirupati Kurnool Nellore Rajahmundry Kakinada Anantapur Kadapa Eluru Ongole Srikakulam Vizianagaram Machilipatnam Chittoor

RNI NO: APTEL/25/A4894
ఉషశ్రీ USHASRI తెలుగు దినపత్రిక
సమస్యలతో ఒంటరిగా పోరాడకండి.
సమాచారం - సహకారం -
పరిష్కారం ఒకే చోట సంప్రదించండి
9295003377

# వృద్ధి రేటుపై ఫోకస్

## పనితీరు ఆధారంగా శాఖలకు స్కోరింగ్: సీఎం చంద్రబాబు



- రాష్ట్ర వృద్ధి కోసం కేపీఐ లక్ష్యాల నిర్దేశం
- జాతీయ సగటును అధిగమించాలని సీఎం ఆదేశం
- వాస్తవ వృద్ధి ఆధారంగా శాఖల పనితీరు అంచనా
- మౌలిక సదుపాయాల పెట్టుబడులకు ప్రత్యేక ప్రాధాన్యం
- ఆర్థిక పర్యవేక్షణకు కృత్రిమ మేధ టాస్క్ ఫోర్సు
- స్వర్ణాంధ్ర లక్ష్యాలకు డేటా ఆధారిత పాలన
- అమరావతి, పోలవరం ప్రాజెక్టులతో వృద్ధి వేగవంతం

**ఆంధ్రప్రదేశ్, ఉష శ్రీ**

ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థను తిరిగి గాడిలో పెట్టేందుకు, వృద్ధి రేటును పరుగులు పెట్టించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కార్యాచరణ ప్రారంభించారు. రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్‌డీపీ) లక్ష్యాలు, ప్రభుత్వ శాఖల పనితీరును కొలిచే కీ-పెర్ఫార్మెన్సు ఇండికేటర్ల (కేపీఐ)పై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. అమరావతిలోని తన క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ సమావేశానికి ఆర్థిక, ప్రణాళిక, వ్యవసాయ, రవాణా, పర్యాటక శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా 2026-27 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిల్లో వివిధ శాఖలకు కేపీఐలను సీఎం నిర్దేశించారు. జాతీయ సగటు కంటే వెనుకబడిన సూచికలను మెరుగుపరచడమే కాకుండా, అగ్రశ్రేణి రాష్ట్రాలతో సమానంగా లక్ష్యాలను చేరుకోవాలని స్పష్టం చేశారు. కేవలం నిర్దేశిత లక్ష్యాలే కాకుండా, వాస్తవ వృద్ధి (రియల్ గ్రోత్) ఆధారంగా శాఖల పనితీరును అంచనా వేసేందుకు స్కోరింగ్ విధానాన్ని అమలు చేయాలని సీఎం నిర్ణయించారు. రాష్ట్ర, క్షేత్రస్థాయి ఆర్థిక స్థితిగతులను ఎప్పటికప్పుడు విశ్లేషించేందుకు ప్రతి నెలా 12వ తేదీన ఆర్థిక నివేదికలను సిద్ధం చేయాలని ఆదేశించారు. మౌలిక సదుపాయాలపై పెట్టే వ్యయం, ఆర్థిక కార్యకలాపాలను 3.5 రెట్లు పెంచేలా ఉండాలని దిశానిర్దేశం చేశారు. ఆర్థిక వ్యవహారాలను రియల్ టైంలో పర్యవేక్షించేందుకు ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) టాస్క్ ఫోర్సు ఏర్పాటు చేయాలనే ఆలోచనను కూడా పంచుకున్నారు.

# రీ ఓపెనింగ్ డేట్ ఫిక్స్

## జూన్ 12 నుంచే ఏపీలో పాఠశాలల పునఃప్రారంభం

- సెలవుల పొడిగింపుపై ప్రచారాన్ని ఖండించిన విద్యాశాఖ
- సోషల్ మీడియాలోని తప్పుడు వార్తలను నమ్మొద్దని సూచన
- విద్యా క్యాలెండర్ ప్రకారమే తరగతులు ప్రారంభం
- తెలంగాణలో జూన్ 15 నుంచి పాఠశాలల ప్రారంభం



**ఆంధ్రప్రదేశ్, ఉష శ్రీ**

ఏపీలో వేసవి సెలవుల తర్వాత స్కూళ్ల పునఃప్రారంభంపై స్పష్టత వచ్చింది. సోషల్ మీడియా వేదికగా స్కూళ్ల రీఓపెనింగ్‌పై జరుగుతున్న ప్రచారంలో నిజం లేదని పాఠశాల విద్యాశాఖ తెలిపింది. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 12 నుంచి పాఠశాలలు తిరిగి ప్రారంభం అవుతాయన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, టీచర్లు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు. సోషల్ మీడియాలో జరిగే ప్రచారాన్ని నమ్మొద్దని అందరికి సూచించారు. ఆంధ్రప్రదేశ్‌లో వేసవి సెలవుల తర్వాత స్కూళ్ల పునఃప్రారంభంపై సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంపై విద్యాశాఖ స్పష్టత ఇచ్చింది. రాష్ట్రంలో స్కూళ్లకు వేసవి సెలవులను పొడిగించే ప్రతిపాదన ఏదీ లేదని విద్యాశాఖ అధికారులు తెలిపారు. గతంలో

# ఆర్థిక సాయం వివరాలు ప్రకటించిన పవన్ కల్యాణ్

- విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాద స్థలాన్ని పవన్ పరిశీలన
- కిమ్స్ ఆసుపత్రిలో క్షతగాత్రులను పరామర్శించిన డిప్యూటీ సీఎం
- బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని హామీ
- నిపుణుల కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు
- త్వరలో కార్మికుల సమస్యలపై సమావేశం నిర్వహిస్తానని వెల్లడి

**ఆంధ్రప్రదేశ్, ఉష శ్రీ**

విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌లో జరిగిన ప్రమాదంపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విశాఖకు చేరుకున్న ఆయన కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. బాధితులను స్వయంగా అడిగి ప్రమాదం జరిగిన తీరును తెలుసుకున్నారు. అనంతరం స్టీల్

# జాతీయ మీడియాలో ప్రత్యేక కథనం

- లోకేష్ రష్యా పర్యటనపై 'ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్' కథనం
- సెయింట్ పీటర్స్‌బర్గ్ ఆర్థిక వేదికలో పాల్గొన్న మంత్రి లోకేష్
- ఏఐ, స్మార్ట్ సిటీలు, తయారీ రంగాల్లో పెట్టుబడుల కోసం చర్చలు
- తిరుపతి స్పేస్ సిటీ ప్రాజెక్టును రష్యా వేదికగా ప్రమోట్ చేసిన లోకేష్
- తక్షణ ఒప్పందాలు లేనప్పటికీ భవిష్యత్ సహకారానికి బలమైన పునాది

**ఆంధ్రప్రదేశ్, ఉష శ్రీ**

ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ ఇటీవలే రష్యాలో జరిపిన పర్యటన, దాని ఫలితాలపై





# 'మమ్మల్ని కాదు, ఫ్యాక్టరీని కాపాడండి'

## క్షతగాత్రుడి మాటలతో కదిలిపోయాను: మంత్రి లోకేష్

- మృతుల కుటుంబాలకు శాశ్వత ఉద్యోగం హామీ
- ప్రతి కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా
- ప్రమాదంపై ఉన్నతస్థాయి దర్యాప్తు కమిటీ
- క్షతగాత్రులకు ప్రభుత్వం శాశ్వత అండ
- విశాఖ ఉక్కు పరిరక్షణకు ఎన్డీయే కట్టుబాటు

**ఆంధ్రప్రదేశ్, ఉష శ్రీ**

విశాఖ స్టీల్ ప్లాంట్‌లో చోటుచేసుకున్న ఘోర ప్రమాదంలో మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు, క్షతగాత్రులకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని మంత్రి నారా లోకేష్ ప్రకటించారు. బాధితులను పరామర్శించిన అనంతరం నారా లోకేష్ మీడియాతో మాట్లాడుతూ.. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం కల్పిస్తున్న భరోసాను వివరించారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా, కాంట్రాక్ట్ లేదా పర్మనెంట్ అనే తేడా లేకుండా మృతుల కుటుంబంలో ఒకరికి శాశ్వత ఉద్యోగం కల్పిస్తామని ప్రకటించారు. కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామి ప్రకటించిన వివరాలను లోకేష్ వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం తరఫున అదనంగా రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియాను ప్రతి కుటుంబానికి అందిస్తున్నట్లు తెలిపారు. నిన్న రాత్రి ఘటనా స్థలాన్ని సందర్శించిన కుమారస్వామి, ఈ మేరకు హామీ ఇచ్చారని చెప్పారు. కుటుంబంలో చదువుకున్న వారికి పర్మనెంట్ ఉద్యోగం ఇవ్వడంపై కేంద్ర ప్రభుత్వ

# నిరూపిస్తే రాజీనామా

- మెగా డీఎస్సీ క్రీడా కోటాపై వైసీపీ ఆరోపణలను ఖండించిన టీడీపీ
- అక్రమాలు జరిగితే 39 పోస్టులు ఎందుకు ఖాళీగా ఉన్నాయని ప్రశ్న
- సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రకారమే నియామకాలు జరిగాయన్న టీడీపీ నేతలు



**ఆంధ్రప్రదేశ్, ఉష శ్రీ**

ఏపీ మెగా డీఎస్సీ క్రీడా కోటా నియామకాల్లో అక్రమాలు జరిగాయంటూ వైఎస్సార్‌సీపీ నేతలు చేస్తున్న ఆరోపణలను తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్సీలు కంచర్ల శ్రీకాంత్, భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. నియామకాల్లో నిజంగానే అవకతవకలు జరిగి ఉంటే, క్రీడా కోటా కింద కేటాయించిన 421 పోస్టుల్లో 39 పోస్టులు ఇప్పటికీ ఎందుకు ఖాళీగా ఉన్నాయో సమాధానం చెప్పాలని వారు నిలదీశారు.

# నిరూపిస్తే రాజీనామా



మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. మంత్రి టీజీ భరత్, ఎమ్మెల్యే కూన రవికుమార్‌లపై వైఎస్సార్‌సీపీ నేతలు చేస్తున్న ఆరోపణలు నిరాధారమైనవని కొట్టిపారేశారు. అర్హులైన అభ్యర్థుల ఎంపికపై అనుమానాలు వ్యక్తం చేయడం క్రీడాకారుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేనని మండిపడ్డారు. అన్ని ధ్రువీకరణ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే నియామక ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేశామని వారు స్పష్టం చేశారు. ధ్రువీకరణ పత్రాల పరిశీలన ప్రక్రియపై వైఎస్సార్‌సీపీ నేతలకు కనీస అవగాహన లేదని ఎమ్మెల్సీ శ్రీకాంత్ విమర్శించారు. తాము అధికారంలోకి వస్తే మెగా డీఎస్సీని రద్దు చేస్తామంటూ అభ్యర్థులను భయభ్రాంతులకు గురిచేయడం తగదన్నారు. ఈ క్రమంలో ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి వైఎస్సార్‌సీపీ నేతలకు బహిరంగ సవాల్ విసిరారు. మెగా డీఎస్సీ నియామకాల్లో అక్రమాలు జరిగినట్లు నిరూపిస్తే తాను తన పదవికి రాజీనామా చేస్తానని, ఈ అంశంపై ఎక్కడైనా చర్చకు సిద్ధమని ఆయన ప్రకటించారు.

# వృద్ధి రేటుపై ఫోకస్



2047 స్వర్ణాంధ్ర లక్ష్యాలకు అనుగుణంగా డేటా ఆధారిత పాలనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు స్పష్టం చేశారు. అమరావతి, పోలవరం, పోర్టులు, ఎయిర్‌పోర్టుల వంటి కీలక ప్రాజెక్టులతో ఆర్థిక వ్యవస్థకు 'మల్టిప్లైయర్ ఎఫెక్ట్' తీసుకురావాలని సూచించారు. కేపీఐలు మెరుగ్గా ఉంటేనే రాష్ట్ర వృద్ధి రేటు పెరుగుతుందని, ప్రతి రంగంలోనూ గ్రాస్ వాల్యూ అడిషన్ (జీవీఏ) పెంపుపై శ్రద్ధ పెట్టాలని ముఖ్యమంత్రి అన్నారు.

## కాంగ్రెస్‌కు ఎదురుదెబ్బ... మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ

**జాతీయం :** మధ్యప్రదేశ్ రాజ్యసభ ద్వివార్షిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీ తరపున ఏకైక అభ్యర్థిగా బరిలో ఉన్న మీనాక్షి నటరాజన్ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి మంగళవారం తిరస్కరించారు. తెలంగాణ కోర్టులో పెండింగ్‌లో ఉన్న ఒక కేసుకు సంబంధించిన సమాచారాన్ని ఆమె ఉద్దేశపూర్వకంగా దాచిపెట్టారంటూ బీజేపీ లేవనెత్తిన అభ్యంతరంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే, హైదరాబాద్ కోర్టులో మీనాక్షి నటరాజన్‌పై ఒక పిటిషన్ దాఖలైంది. లైంగిక వేధింపులు, ప్రాణహాని బెదిరింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తికి మీనాక్షి రాజకీయ అండదండలు అందించారని ఎ.శ్రీలత అనే మాజీ కార్పొరేట్ ఎగ్జిక్యూటివ్ ఆ పిటిషన్‌లో ఆరోపించారు. ఈ విషయాన్ని నామినేషన్‌లో ప్రస్తావించలేదని బీజేపీ అభ్యంతరం వ్యక్తం చేసింది. అయితే, బీజేపీ ఆరోపణలను కాంగ్రెస్ నేత ఉమంగ్ సింఘార్ "బలవంతపు రాజకీయాలు"గా అభివర్ణించారు. మీనాక్షిపై ఎలాంటి కేసు నమోదు కాలేదని, కేవలం కోర్టు నుంచి నోటీసు మాత్రమే అందిందని ఆయన స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం కేసు నమోదైతేనే వివరాలు వెల్లడించాలి తప్ప, నోటీసుకు కాదని వాదించారు. ఇదంతా తన ప్రతిష్ఠకు భంగం కలిగించేందుకు చేస్తున్న రాజకీయ కుట్ర అని మీనాక్షి నటరాజన్ అన్నారు. "ఒక గాంధేయవాద మహిళను చూసి బీజేపీ భయపడుతోంది" అని ఉమంగ్ సింఘార్ ఎక్స్ వేదికగా విమర్శించారు. "వారి నినాదం 'నారీ వందన్', కానీ నైజం 'నారీ అపమాన్'.. ఇదే బీజేపీ అసలు స్వరూపం" అని దుయ్యబట్టారు. సత్యం, రాజ్యాంగం, ప్రజాభిప్రాయం శక్తితో తాము విజయం సాధిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.దమీనాక్షి నటరాజన్ ప్రస్తుతం తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్చార్జిగా కొనసాగుతుండడం తెలిసిందే.

# 'మమ్మల్ని కాదు, ఫ్యాక్టరీని కాపాడండి'



కార్యదర్శి నిబంధనల గురించి ప్రస్తావించగా, "అవసరమైతే కేబినెట్‌కు తీసుకెళ్లైనా దీన్ని సాధిస్తాను, ఇది నా బాధ్యత" అని కుమారస్వామి స్పష్టం చేశారని లోకేష్ వివరించారు. ప్రభుత్వం కేవలం హామీలు ఇచ్చి చేతులు దులుపుకోదని, బాధితులకు శాశ్వతంగా అండగా నిలుస్తుందని లోకేష్ స్పష్టం చేశారు. "నిన్న సాయంత్రం 4:10 గంటలకు ప్రమాదం జరగగానే కలెక్టర్, సీపీ ఘటనా స్థలానికి చేరుకున్నారు. హోం మంత్రి అనిత, ఎంపీ శ్రీభరత్, పల్లా శ్రీనివాస్ కూడా వచ్చారు. కేంద్ర మంత్రులు కుమారస్వామి, వర్మ కూడా వెంటనే స్పందించి పరిస్థితిని సమీక్షించారు. కుమారస్వామి గారు ఇచ్చిన ఆదేశాల మేరకు, ఈరోజు తేదీ మారేలోపే 8 మంది మృతుల కుటుంబాల అకౌంట్లలోకి తక్షణ సాయంగా రూ.25 లక్షలు జమ చేస్తాం. దీనితో పాటు పీఎఫ్, స్టీల్ ప్లాంట్ నిబంధనల ప్రకారం రావాల్సిన మిగతా పరిహారం కూడా త్వరలోనే అందిస్తాం" అని తెలిపారు. ప్రమాదం జరిగిన తీరుపై లోతైన దర్యాప్తు జరుగుతుందని లోకేష్ అన్నారు. "ఇది కింద నుంచి లీకవ్వలేదు, పైనుంచి పొంగలేదు. ద్రవ ఉక్కు బయటకు కక్కినట్లుగా ఉంది. దీని వెనుక కారణాలను నిగ్గు తేల్చేందుకు ముగ్గురు సీనియర్ అధికారులతో ఉన్నతస్థాయి కమిటీని వేశారు. వారు ఈరోజే విశాఖ వచ్చి కార్మికులతో మాట్లాడి నివేదిక సమర్పిస్తారు. నివేదిక ఆధారంగా కఠిన చర్యలు ఉంటాయి" అని వివరించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో జరిగిన ఓ సంఘటనను లోకేష్ ఉద్వేగంగా పంచుకున్నారు. "గాయపడిన శ్రీనివాస్ అనే కార్మికుడిని పరామర్శిస్తే, ఆయన తన ఆరోగ్యం గురించి కాకుండా 'అయ్యా, మమ్మల్ని కాదు, దయచేసి విశాఖ ఉక్కును కాపాడండి. లక్షలాది కుటుంబాలు దీనిపై ఆధారపడి ఉన్నాయి' అని వేడుకున్నాడు. ఆ మాటలు కార్మికులకు ఫ్యాక్టరీతో ఉన్న అనుబంధాన్ని తెలియజేశాయి. ఆయన మాటలు నన్ను కదిలించాయి" అని అన్నారు. గతంలో వాజ్‌పేయి, చంద్రబాబు హయాంలో రూ.15 వేల కోట్ల ప్యాకేజీతో ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకున్నామని గుర్తుచేశారు. ఇప్పుడు కూడా కార్మికుల కుటుంబాలకు అదే విధంగా ఎన్డీయే ప్రభుత్వం అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. ఉత్తరాంధ్రకు రానున్న భారీ పెట్టుబడుల నేపథ్యంలో నైపుణ్యాభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని, యువతకు శిక్షణ ఇచ్చే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని లోకేష్ హామీ ఇచ్చారు.

# ఆర్థిక సాయం వివరాలు ప్రకటించిన పవన్ కల్యాణ్



ప్లాంట్‌లోని ప్రమాద స్థలాన్ని పరిశీలించి యాజమాన్యం, ఉన్నతాధికారులతో మాట్లాడారు. ఈ ఘటనలో మృతుల కుటుంబాలకు రూ. 25 లక్షల చొప్పున పరిహారం అందించనున్నట్లు ప్రకటించారు. గాయపడిన వారికి రూ. 10 లక్షల చొప్పున సాయం అందిస్తామని, వారి పూర్తి చికిత్స ఖర్చులను ఆర్.ఐ.ఎన్.ఎల్. భరిస్తుందని పవన్ కళ్యాణ్ తెలిపారు. మృతుల కుటుంబ సభ్యుల్లో ఒకరికి స్టీల్ ప్లాంట్‌లో ఉద్యోగం కల్పిస్తామన్నారు. పదవీ విరమణ ప్రయోజనాల కింద రెగ్యులర్ ఉద్యోగులకు రూ. 1.72 కోట్లు, కాంట్రాక్టు ఉద్యోగులకు రూ. 45.75 లక్షలు అందుతాయని వివరించారు. మృతుల పిల్లల చదువులకు కూడా యాజమాన్యం సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. గత 30 ఏళ్లలో ఇలాంటి ఘోర దుర్ఘటన జరగలేదని పవన్ పేర్కొన్నారు. ప్రమాదం జరిగిన ముందు రోజు రాత్రి కూడా ప్లాంట్‌లో ఇలాంటి చిన్న సాంకేతిక లోపం తలెత్తిందని, అయితే రాత్రి వేళ కార్మికులు ఎవరూ లేకపోవడం వల్ల ఎవరికీ తెలియలేదని తన దృష్టికి తెచ్చారని ఆయన వివరించారు. ప్లాంట్‌లో భద్రతా ప్రమాణాలు, యంత్రాల ఆధునికీకరణపై దర్యాప్తు చేయడానికి ఒక ప్రత్యేక త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేశామని, వారి నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. స్టీల్ ప్లాంట్ కార్మికుల సమస్యలపై, వారి భద్రతపై త్వరలోనే ఒక ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి స్వయంగా కార్మికులతో మాట్లాడతానని పవన్ హామీ ఇచ్చారు. ఇలాంటి ఘోర ప్రమాదాలు జరిగినప్పుడు కేవలం బాధపడి వదిలేయకుండా.. ఉద్యోగుల ప్రాణాలకు రక్షణ కల్పించేందుకు యాజమాన్యం నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# రీ ఓపెనింగ్ డేట్ ఫిక్స్



ప్రకటించిన విధంగానే విద్యా సంవత్సరానికి సంబంధించిన క్యాలెండర్ ప్రకారమే ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ స్కూల్స్ 12 జూన్ 2026 (శుక్రవారం) నుంచి యథావిధిగా పునఃప్రారంభం అవుతాయన్నారు. తెలంగాణలో స్కూల్స్ పునఃప్రారంభ తేదీని జూన్ 15, 2026కు మార్చారని (జూన్ 13 రెండో శనివారం, జూన్ 14 ఆదివారం).. ఏపీలో మాత్రం ఎలాంటి మార్పు లేదని తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, టీచర్లు సోషల్ మీడియాలో జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దని అధికారులు సూచించారు. మరోవైపు తెలంగాణలో మరోసారి వేసవి సెలవుల్ని పొడిగిస్తారనే ప్రచారంలో నిజంలేదని పాఠశాల విద్యాశాఖ తెలిపింది. సోషల్ మీడియాతో పాటుగా మరికొన్ని చోట్ల జరుగుతున్న ప్రచారంలో నిజం లేదన్నారు. ఇప్పటికే ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం జూన్ 15 నుంచి స్కూళ్లు పునఃప్రారంభం అవుతాయన్నారు. రాష్ట్రంలో వేసవి సెలవులు జూన్ 14తో ముగుస్తాయని.. జూన్ 15 నుంచి అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు తిరిగి ప్రారంభం కానున్నాయని చెప్పారు. ఇప్పటికే 2026--27 విద్యా సంవత్సరానికి సంబంధించిన అకడమిక్ క్యాలెండర్లను విడుదల చేసిన విషయాన్ని గుర్తు చేశారు. సెలవుల పొడిగింపుపై జరుగుతోన్న ప్రచారాన్ని నమ్మొద్దని సూచించారు. ఈ ఏడాది వేసవి కాలంలో ఎండల తీవ్రత కనిపించింది.. ఏకంగా 48 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మరికొద్ది రోజులు ఎండల తీవ్రత కొనసాగుతుందనే అంచనాలతో పలు రాష్ట్రాల్లో వేసవి సెలవుల్ని పొడిగించారు. తెలంగాణలో కూడా ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో జూన్ 14 వరకు సెలవులు పొడిగించి.. జూన్ 15 నుంచి తిరిగి స్కూళ్లు ప్రారంభమవుతాయన్నారు. తెలుగు రాష్ట్రాల్లో వాతావరణం మెల్లిగా మారుతోంది.. నైరుతి రుతుపవనాల రాకతో వాతావరణం మెల్లిగా చల్లబడుతోంది. అక్కడక్కడా వర్షాలు కూడా పడుతున్న సంగతి తెలిసిందే. ఎండల తీవ్రత మెల్లిగా తగ్గుతుందని భావిస్తున్నారు.

# జాతీయ మీడియాలో ప్రత్యేక కథనం



ప్రముఖ ఆంగ్ల దినపత్రిక 'ది న్యూ ఇండియన్ ఎక్స్ ప్రెస్' జూన్ 9న ఒక ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. ఈ పర్యటన ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పరిశ్రమలు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), రవాణా, తయారీ, టెక్నాలజీ, స్మార్ట్ సిటీల వంటి కీలక రంగాల్లో కొత్త అవకాశాలు లభించనున్నాయని ఆ కథనం విశ్లేషించింది. సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో జరిగిన ప్రతిష్టాత్మక అంతర్జాతీయ ఆర్థిక వేదిక (ూ×జుఖీ) 2026 సదస్సులో మంత్రి లోకేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రష్యా ప్రభుత్వ ప్రతినిధులు, ప్రముఖ కంపెనీలతో ఆయన ఉన్నత స్థాయి సమావేశాలు నిర్వహించారు. ఇప్పటికే రాష్ట్రంలో అల్యూమినా స్మెల్టర్ ఏర్పాటుకు పెట్టుబడులు పెట్టిన 'రుసాల్' (=ఖుూాూ) వంటి సంస్థలతో ఉన్న భాగస్వామ్యాన్ని సమీక్షించారు. అల్యూమినియం విలువ ఆధారిత ఉత్పత్తులు, ఆటోమోటివ్, ఏరోస్పేస్ మిశ్రమ లోహాలు, ఫాయిల్ ఉత్పత్తి వంటి రంగాల్లో సహకారాన్ని మరింత విస్తరించుకోవడంపై చర్చించారు. పర్యటనలో భాగంగా ఇంధనం, లాజిస్టిక్స్, రవాణా, రైల్వేల తయారీ, క్రిటికల్ మినరల్స్, సెమీకండక్టర్లు, డిజిటల్ మౌలిక సదుపాయాల వంటి అనేక రంగాలకు చెందిన ప్రతినిధులతో లోకేష్ సమావేశమయ్యారు. ముఖ్యంగా, మాస్కో రవాణా శాఖ మంత్రి, వైస్ మేయర్ మాగ్జిమ్ లిక్సుటోవ్‌తో భేటీ అయి, ఏఐ ఆధారిత ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ వ్యవస్థలు, స్మార్ట్ రవాణా పరిష్కారాలపై చర్చించారు. సెయింట్ పీటర్స్‌బర్గ్ అధికారులతో సురక్షితమైన, స్మార్ట్ సిటీ ప్రాజెక్టుల నిర్మాణంలో సహకారం గురించి మాట్లాడారు. టెక్నాలజీ, నైపుణ్యాభివృద్ధి అంశాలకు ఈ పర్యటనలో పెద్దపీట వేశారు. రష్యాకు చెందిన ప్రముఖ 'స్బేర్‌బ్యాంక్' (ూఎవతీఃఖఅఎ) నాయకత్వంతో ఏఐ, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్, ఆవిష్కరణలపై చర్చలు జరిపారు. 'స్కూల్ 21', 'స్బేర్‌సిటీ' వంటి సంస్థలను సందర్శించి అక్కడి నూతన ఆవిష్కరణల గురించి తెలుసుకున్నారు. అలాగే, తతార్‌స్థాన్ రిపబ్లిక్‌తో పారిశ్రామిక, వాణిజ్య సహకారంపై చర్చలు జరిపినట్లు 'ది న్యూ ఇండియన్ ఎక్స్ ప్రెస్' తన కథనంలో పేర్కొంది. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ, "భారత్, రష్యా మధ్య దీర్ఘకాలంగా విశ్వసనీయ భాగస్వామ్యం ఉంది. ూ×జుఖీ 2026 సదస్సులో మా చర్చలు పరిశ్రమలు, టెక్నాలజీ, స్మార్ట్ సిటీలు, ఏఐ, అత్యాధునిక తయారీ రంగాల్లో కొత్త సహకారానికి మార్గం వేశాయి," అని తెలిపారు. మౌలిక సదుపాయాలు, మానవ వనరులు, స్థిరమైన విధానాలతో ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచ తయారీ, టెక్నాలజీ కేంద్రంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న 'స్పేస్ పాలసీ 4.0'ను, శ్రీహరికోట సమీపంలో 3000 ఎకరాల్లో నిర్మించతలపెట్టిన 'తిరుపతి స్పేస్ సిటీ' ప్రాజెక్టును కూడా లోకేష్ బృందం ప్రమోట్ చేసింది. స్పేస్ టెక్నాలజీ, సెమీకండక్టర్లు, డ్రోన్లు, క్వాంటం కంప్యూటింగ్ వంటి రంగాల్లో సుమారు 4 బిలియన్ డాలర్ల పెట్టుబడులను ఆకర్షించడం ఈ ప్రాజెక్టు లక్ష్యం. సెయింట్ పీటర్స్‌బర్గ్ సమీపంలో డ్రోన్ల కదలికల వంటి భద్రతాపరమైన ఆందోళనలు ఉన్నప్పటికీ, లోకేష్ బృందం తమ లక్ష్యాలను పూర్తి చేసేందుకు పర్యటనను విజయవంతంగా కొనసాగించింది. పర్యటన ముగిసిన వెంటనే నిర్దిష్టంగా కొత్త ఒప్పందాలు ఏవీ కుదిరినట్లు అధికారికంగా ప్రకటించనప్పటికీ, భవిష్యత్ సహకారానికి, పెట్టుబడులకు ఈ పర్యటన బలమైన పునాది వేసిందని 'ది న్యూ ఇండియన్ ఎక్స్ ప్రెస్' కథనం విశ్లేషించింది.

# అన్నదానం లో ఈఓ తనిఖీలు



**కాకినాడ,జూన్ 9 (ఉష ంతీఅ ప్రతినిధి):** ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరం శ్రీ సత్యనారాయణ స్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న అన్నదాన విభాగాన్ని ఈఓ, జాయింట్ కమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. భక్తులకు అందుతున్న సేవల నాణ్యతను పరిశీలించేందుకు ఈవో ఈ ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఇందులో భాగంగా దేవస్థానంలోని నిత్య అన్నదాన విభాగాన్ని ఆయన సందర్శించారు. ?భక్తులకు వడ్డించే అన్నప్రసాదాల నాణ్యత, రుచిని స్వయంగా పరిశీలించిన ఈవో భోజనశాలలో కూర్చున్న భక్తుల వద్దకు వెళ్లి వారితో ముఖాముఖి మాట్లాడారు. అన్నప్రసాదం ఎలా ఉంది? దేవస్థాన వసతులు, సిబ్బంది ప్రవర్తన పట్ల సంతృప్తిగా ఉన్నారా? అని అడిగి తెలుసుకున్నారు. ఈవో చొరవపై భక్తులు సానుకూలంగా స్పందిస్తూ, అన్నప్రసాదం నాణ్యత బాగుందని హర్షం వ్యక్తం చేశారు. పూర్తి పారదర్శకంగా సేవలు అందించే ఏర్పాటు చేస్తున్నట్లు ఈవో తెలిపారు.

# మహిళల గురించి మాట్లాడే నైతిక హక్కు జగన్‌కు లేదు: సానా సతీష్



**అమరావతి ,(ఉషశ్రీ )జూన్ 9:** మహిళల గౌరవం గురించి మాట్లాడే నైతిక హక్కు వైసీపీ అధినేత వై.ఎస్ . జగన్ మోహన్ రెడ్డి కి లేదని టీడీపీ రాజ్యసభ అభ్యర్థి సానా సతీష్ ఒక ప్రకటన లో విమర్శించారు. ఆయన మాట్లాడుతూ, వైసీపీ ఐదేళ్ల పాలనలో 11 మందికి రాజ్యసభ సభ్యత్వాలు ఇచ్చినా ఒక్క మహిళకూ అవకాశం కల్పించలేదన్నారు. మహిళల పట్ల గౌరవం ఉంటే అప్పుడే చూపించాల్సిందని వ్యాఖ్యానించారు. టీడీపీ మహానాడులో మహిళలకు 33 శాతం సీట్లు కేటాయిస్తామని ప్రకటించిన తర్వాత జగన్ మహిళా సాధికారత గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. కుటుంబ సభ్యులకే గౌరవం ఇవ్వలేని వ్యక్తి మహిళల గురించి మాట్లాడటం ప్రజలను మభ్యపెట్టడమేనని విమర్శించారు. మహిళల సాధికారత, భద్రత, ఆర్థికాభివృద్ధికి టీడీపీ కట్టుబడి ఉందన్నారు.

# ధవళేశ్వరంలో వైభవంగా శ్రీదేవి పోలేరమ్మ జాతర మహోత్సవాలు





**ధవళేశ్వరం, (ఉషశ్రీ ) జూన్ 9:** ధవళేశ్వరంలోని శ్రీ శ్రీదేవి పోలేరమ్మ ౹వఎజూశ్రీవలో మూడు రోజుల పాటు నిర్వహించిన శ్రీదేవి పోలేరమ్మ జాతర మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో ముగిశాయి. జూన్ 7 నుంచి 9 వరకు జరిగిన ఉత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతరలో భాగంగా మంగళవారం ఉదయం ఆలయ ధర్మకర్త ఎం. రాజుబాబు, శ్రీమతి ఎం. సాయి లక్ష్మీ దంపతులు పట్టువస్త్రాలు, ఆభరణాలను ఘన ఊరేగింపుగా తీసుకువెళ్లి అమ్మవారికి సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు పొందారు. మధ్యాహ్నం పోలేరమ్మ అమ్మవారిని గోదావరి తీరం వద్దకు ఊరేగింపుగా తీసుకెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే మహిళలకు పసుపు, కుంకుమ, గాజుల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. సాయంత్రం డప్పుల వాయిద్యాలు, కోలాటాలు, సాంప్రదాయ కళారూపాలు, వివిధ వేషధారణలు, నృత్య ప్రదర్శనలు, విద్యుత్ దీపాలంకరణల మధ్య జాతర ఊరేగింపు వైభవంగా సాగి భక్తులను ఆకట్టుకుంది. జాతర విజయవంతానికి సహకరించిన కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు, దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

# ఇండికేటర్లు తప్పనిసరిగా ఉపయోగించాలి; సీఐ రామకోటయ్య



**గిద్దలూరు,ఉషశ్రీ.** గిద్దలూరు రూరల్ సీఐ రామకోటయ్య ఆటో డ్రైవర్లకు కీలక సూచనలు చేశారు. మూలమలుపులు తిరిగేటప్పుడు తప్పనిసరిగా ఇండికేటర్లు ఉపయోగించాలని, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని విజ్ఞప్తి చేశారు. ఇటీవల రోడ్డు ప్రమాదాలు అధికమవుతున్న నేపథ్యంలో, వాటి నివారణకు ఆటో డ్రైవర్లు కృషి చేయాలని, తమ వద్ద ఆటో సంబంధిత ధ్రువపత్రాలతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని సీఐ తెలిపారు. ఇండికేటర్లు వాడటం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని ఆయన సూచించారు.

# యోగతో ఆరోగ్యవంతమైన సమాజం





- మారేడుమిల్లి అరణ్య ప్రాంతంలో యోగాంధ్రకు విశేష స్పందన..
- కలెక్టర్ దినేష్ కుమార్..

**రంపచోడవరం/,జూన్ 09( ఉష శ్రీ ప్రతినిధి):** ప్రతి వ్యక్తి ప్రతిరోజూ కనీసం 45 నిమిషాలు యోగా సాధన చేస్తే శారీరకంగా,మానసికంగా ఆరోగ్యవంతంగా ఉండవచ్చని పోలవరం జిల్లా కలెక్టర్ కె.దినేష్ కుమార్ పేర్కొన్నారు. యోగాంధ్ర--2026 కార్యక్రమంలో భాగంగా మంగళవారం మారేడుమిల్లి సమీపంలోని వుడ్స్ రిసార్ట్స్ ప్రాంగణంలో నిర్వహించిన యోగా సాధన కార్యక్రమాన్ని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎస్.బొజ్జిరెడ్డి, రంపచోడవరం ఎమ్మెల్యే, మిరియాల శిరీష దేవి, జాయింట్ కలెక్టర్ సురపాటి ప్రశాంత్ కుమార్, రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యురాలు గొర్లె సునీత తదితరులతో కలిసి కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యోగా భారతదేశానికి చెందిన అమూల్యమైన వారసత్వ సంపద అని,దాని విశిష్టతను ప్రపంచానికి చాటిచెప్పే క్రమంలో 2014లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఐక్యరాజ్యసమితిలో తీసుకున్న చొరవతో జూన్ 21ను అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ప్రపంచ దేశాలు జరుపు కుంటున్నాయని తెలిపారు.రాష్ట్ర ముఖ్యమంత్రి పిలుపు మేరకు యోగా ప్రయోజనాలను ప్రతి ఇంటికీ చేరవేసేందుకు 14 రోజులపాటు యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఒత్తిడితో కూడిన ఆధునిక జీవనశైలిలో ప్రతి ఒక్కరూ యోగాను దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు.కొత్తగా ఏర్పడిన పోలవరం జిల్లాలో పర్యాటకాభివృద్ధికి అపార అవకాశాలు ఉన్నాయని, వాటిని ప్రోత్సహించాలనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమాన్ని మారేడుమిల్లి వంటి ప్రకృతి అందాల మధ్య నిర్వహిస్తున్నామని కలెక్టర్ వివరించారు.గుడిసె, మారేడుమిల్లి,పరిసర ప్రాంతాల్లోని పర్యాటక కేంద్రములను యోగాంధ్ర ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ప్రజలకు పరిచయం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. జిల్లాలో ప్రతి పౌరుడికి కామన్ యోగా ప్రోటోకాల్‌పై శిక్షణ అందిస్తున్నామని, రాబోయే రోజుల్లో మరిన్ని యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.జూన్ 17న చింతూరు మండలం మోతుగూడెంలో,జూన్ 21న రంపచోడవరంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని భారీ ఎత్తున నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. ఈ కార్యక్రమాలకు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ మాట్లాడుతూ మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో యోగాంధ్ర నిర్వహించడం ఆనందదాయకమని అన్నారు. యోగా వల్ల ఆరోగ్య ప్రయోజనాలు అపారమని,ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వంటి నాయకులు కూడా నిత్య యోగా ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారని చెప్పారు. ప్రతి ఒక్కరూ యోగాను జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు.ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం కూడా ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్య అంశమని పేర్కొన్నారు. యోగా చేయడం వల్ల కుటుంబాలు ఆరోగ్యవంతంగా మారడంతో పాటు సమాజం కూడా ఆరోగ్యకరంగా రూపుదిద్దుకుంటుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ యోగా సాధన చేసి ఆరోగ్యంగా, ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు. పోలవరం జిల్లాలో ప్రతి వ్యక్తికి యోగా పట్ల అవగాహన కల్పించే బాధ్యత అందరిపైనా ఉందన్నారు. అనంతరం యోగా గురువులు కథల నారాయణరెడ్డి, కథల వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో వివిధ యోగాసనాలను ప్రదర్శించి పాల్గొన్న వారితో సాధన చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పి. అంబేద్కర్,ఆర్డీవో కె.స్వాతి, ఎస్డీపీఓ అష్రఫ్ అలీ,రాష్ట్ర మైనార్టీ కమిటీ సభ్యుడు షేక్ సుభాని, ప్రజాప్రతినిధులు,వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.



# పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలి



**విజయవాడ, (ఉషశ్రీ )జూన్ 9:** పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల పెంపును నిరసిస్తూ 10 వామపక్ష పార్టీల రాష్ట్ర కమిటీల పిలుపు మేరకు మంగళవారం కృష్ణలంక జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. వామపక్ష పార్టీల నగర కమిటీల ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసనలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జీ. ఈశ్వరయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ ఇంధన ధరల పెంపు సామాన్య, మధ్యతరగతి ప్రజలపై ప్రత్యక్ష ఆర్థిక దాడిగా మారిందన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెరగడంతో రవాణా ఖర్చులు, నిత్యావసర వస్తువుల ధరలు కూడా పెరిగి ప్రజల జీవనం మరింత భారంగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారంలోకి రాకముందు ఇంధన ధరలను తగ్గిస్తామని హామీ ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం, ప్రస్తుతం చమురు కంపెనీలకు అనుకూలంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. అంతర్జాతీయ పరిస్థితులను సాకుగా చూపుతూ ధరలు పెంచుతున్నారని, అయితే ముడి చమురు ధరలు తగ్గిన సమయంలో వినియోగదారులకు ఆ ప్రయోజనం ఎందుకు అందించలేదని ప్రశ్నించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధిస్తున్న పన్నుల కారణంగా ఇంధన ధరలు మరింత పెరిగి సామాన్య ప్రజలకు గుదిబండగా మారాయని అన్నారు. అలాగే కేజీ బేసిన్‌లోని గ్యాస్ నిల్వల విషయంలో రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రాన్ని ప్రశ్నించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని, ప్రజలపై పడుతున్న అదనపు భారం తొలగించాలని ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి జి. కోటేశ్వరరావు, సీపీఎం నాయకుడు సిహెచ్. బాబురావు, న్యూడెమోక్రసీ నాయకులు యు. వెంకటేశ్వరరావు, రవీంద్ర, ఎస్‌యూసీఐ నాయకుడు అమర్‌నాథ్, లిబరేషన్ నాయకుడు హరినాథ్, ఎంసీపీఐ యువ నాయకుడు ఖాదర్ బాషా, సీపీఐ(ఎంఎల్) నాయకుడు వీరబాబు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు జాన్సన్ బాబు, ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య, అధ్యక్షుడు పి. చంద్ర నాయక్, కోశాధికారి ఆర్. పిచ్చయ్య, సీపీఐ నాయకులు కె.వి. భాస్కరరావు, తాడి పైడయ్య, పంచదార్ల దుర్గాంబ, అప్పూరుబోతు రాము, కొట్టు రమణారావు, సంగుల పేరయ్య, డి.వి. రమణబాబు, తూనం వీరయ్య, కోడలి ఆనందరావు, బుద్దే రాజా, దుగ్గిరాల సీతారావమ్మ, కె.ఆర్. ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ఉద్యమంగా యోగాంధ్ర-2026



**విజయవాడ, (ఉషశ్రీ) జూన్ 9:** యోగాంధ్ర-2026 కార్యక్రమాన్ని ప్రజా ఉద్యమంగా నిర్వహిస్తూ స్వర్ణాంధ్ర, ఆరోగ్యాంధ్ర లక్ష్యాల సాధనకు ముందుకు సాగుతున్నామని ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ జీ . లక్ష్మీశ తెలిపారు. ఈ బృహత్తర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. విజయవాడ అర్బన్ పరిధిలోని బీఆర్‌టీఎస్ రోడ్డులో మంగళవారం నిర్వహించిన యోగా అభ్యాస కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని వివిధ శాఖల అధికారులు, ప్రజలతో కలిసి యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి, ముఖ్యమంత్రి స్ఫూర్తితో జిల్లాలో ఊరూవాడా యోగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. బీఆర్‌టీఎస్ రోడ్డుతో పాటు బెరం పార్క్, పర్యాటక ప్రాంతాలు, ఆలయాలు, పార్కులు, ప్రభుత్వ కార్యాలయాలు తదితర ప్రాంతాల్లో యోగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజల ఆరోగ్యం, ఆనందం కోసం రాష్ట్రవ్యాప్తంగా యోగాను ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు. ఆయుష్, వైద్య ఆరోగ్య, పురపాలక, రెవెన్యూ, పంచాయతీరాజ్, యువజన సంక్షేమం, విద్యాశాఖల సమన్వయంతో రోజుకో ప్రత్యేక థీమ్‌తో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వివరించారు. జిల్లాలో దాదాపు 10 వేల మంది యోగా ట్రైనర్లు అందుబాటులో ఉన్నారని, ప్రజలు వారి సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రోజుకు 45 నిమిషాలు యోగా సాధన చేస్తే జీవనశైలి వ్యాధుల నుంచి దూరంగా ఉండటంతో పాటు 60 నుంచి 70 శాతం వరకు ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చని కలెక్టర్ తెలిపారు. యోగా ద్వారా ఒత్తిడి తగ్గి ఏకాగ్రత, శక్తి, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో విజయవాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ డి. చంద్రశేఖర్, జిల్లా ఆయుష్ అధికారి డా. వై. రత్నప్రియదర్శిని, యువజన సంక్షేమ అధికారి డా. కొల్లేటి రమేష్, డీఎంహెచ్‌వో డా. జె. ఇందుమతి తదితరులు పాల్గొన్నారు.



# నిడమానూరులో భారీ గంజాయి పట్టివేత





- రూ.70 లక్షల విలువైన 140 కిలోల గంజాయి స్వాధీనం
- ఇద్దరు అరెస్ట్, ముగ్గురు పరారీ

**విజయవాడ, పోలీస్ కమిషనరేట్ (ఉషశ్రీ )జూన్ 9:** రాష్ట్రాన్ని మాదకద్రవ్య రహితంగా మార్చే లక్ష్యంతో పోలీసులు చేపడుతున్న ప్రత్యేక చర్యల్లో భాగంగా ఎన్‌టీఆర్ జిల్లా పోలీసు కమిషనరేట్ పరిధిలో భారీ గంజాయి రవాణాను పోలీసులు అడ్డుకున్నారు. పటమట పోలీస్ స్టేషన్ పరిధిలోని నిడమానూరు ప్రాంతంలో నిర్వహించిన తనిఖీల్లో సుమారు రూ.70 లక్షల విలువైన 140 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. ఎన్‌టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ , ఈగల్ ఐజీ పర్యవేక్షణలో లా అండ్ ఆర్డర్ పోలీసులు, ఈగల్ బృందాలు సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో ఈ విజయం సాధించారు. అందుకు సంబంధించిన విలేకరుల సమావేశం మంగళవారం కమిషనర్ కార్యాలయంలో జరిగింది.


సమావేశంలో డీసీపీ కృష్ణకాంత్ పటేల్, ఈగల్ ఎస్పీ నగేష్ వివరాలు వెల్లడించారు. వివరాల ప్రకారం భారీగా గంజాయి రవాణా అవుతుందని సమాచారం అందుకున్న పోలీసులు మంగళవారం తెల్లవారుజామున నిడమానూరు ప్రాంతంలో వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పటమట ఇన్‌స్పెక్టర్ పవన్ కిషోర్, ఈగల్ ఇన్‌స్పెక్టర్ రవీంద్ర తమ సిబ్బందితో కలిసి అనుమానాస్పదంగా వెళ్తున్న లారీలను ఆపి తనిఖీ చేశారు. అందులో ఒక లారీ గంజాయి సంచులతో వెళ్తుండటం గుర్తించారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా మరో లారీలో కూడా గంజాయి తరలిస్తున్నట్లు తెలిసింది. దీంతో మరో డ్రైవర్‌ను కూడా అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా మొత్తం 140 కిలోల గంజాయి, గంజాయి రవాణాకు ఉపయోగించిన ఒక లారీని స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన నిందితులు తమిళనాడు రాష్ట్రంలోని ధర్మపురి జిల్లాకు చెందిన సెల్వం (39), టి. ప్రదీప్ (36) అనే ఇద్దరు వీరిద్దరూ ఒక ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ సంస్థలో లారీ డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. ఒడిశా నుంచి స్టీల్ కాయిల్స్ లోడ్‌తో తమిళనాడుకు వెళ్తున్న సమయంలో శ్రీకాకుళం జిల్లా సమీపంలో కొందరు వ్యక్తులు డ్రైవర్ సెల్వంను సంప్రదించారు. గంజాయిని కోయంబత్తూరుకు తరలిస్తే రూ.30 వేల ఇస్తామని చెప్పడంతో అంగీకరించాడు. అనంతరం తనతో పాటు వస్తున్న మరో డ్రైవర్ ప్రదీప్ లారీలో కూడా గంజాయి లోడ్ చేయించి ఇద్దరూ కోయంబత్తూరు వైపు బయలుదేరారు. ఒడిశాలోని గజపతి జిల్లాకు చెందిన ఆరూప్ సింగ్ (24), రాజేష్ కుమార్ సింగ్ (25), కేరళలోని మళప్పురం జిల్లాకు చెందిన మొహమ్మద్ సోహెల్ (27) పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. వారి కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ సమావేశంలో ఏడీసీపీ ఎన్‌బీఎం మురళీకృష్ణ, సెంట్రల్ ఏసీపీ దామోదర్, పటమట ఇన్‌స్పెక్టర్ పవన్ కిషోర్, ఈగల్ ఇన్‌స్పెక్టర్ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

# ఇంద్రకీలాద్రిలో పరిశుభ్రత, త్రాగునీటి సౌకర్యాలపై ఈఓ శీనా నాయక్ ఆదేశాలు



**విజయవాడ, (ఉషశ్రీ )జూన్ 9:** ఇంద్రకీలాద్రి పుణ్యక్షేత్రంలో పరిసరాల పరిశుభ్రత, భక్తులకు అందిస్తున్న త్రాగునీటి సౌకర్యాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని దేవస్థానం కార్యనిర్వహణాధికారి వి.కె. శీనా నాయక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన క్షేత్రస్థాయిలో పలు ప్రాంతాలను పరిశీలించి సంబంధిత సిబ్బందికి సూచనలు చేశారు. శివాలయం నుంచి పూజా మండపాలకు వెళ్లే మార్గం అపరిశుభ్రంగా ఉండటాన్ని గమనించిన ఈఓ, వెంటనే శుభ్రపరిచే చర్యలు చేపట్టాలని సూపర్‌వైజర్‌ను ఆదేశించారు. కొండపై వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన తాగునీటి పంపులను పరిశీలించిన ఆయన, వాటి పరిసరాలు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా చూడాలని సూచించారు. అలాగే చండీ హోమం నిర్వహించే ప్రాంతంలో భక్తులకు అనుకూలంగా మరిన్ని సౌకర్యాలు కల్పించాలని ఇంజినీరింగ్ విభాగం సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ప్రధాన ఆలయంలో "ఓం కనకదుర్గాయ నమః" అనే అమ్మవారి నామస్మరణ నిరంతరం మైక్ ద్వారా వినిపించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే దర్శనం అనంతరం బయటకు వెళ్తున్న రూ.500 దుర్గా దివ్య దర్శనం భక్తులకు ఉచిత లడ్డూ పంపిణీ కేంద్రం వివరాలను మైక్ ద్వారా ప్రకటించే ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. భక్తులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా దేవస్థానం అన్ని సౌకర్యాలను నిరంతరం పర్యవేక్షిస్తోందని ఈ సందర్భంగా ఈఓ పేర్కొన్నారు.

# దోషరహిత ఓటర్ల జాబితా రూపకల్పనలో అధికారులు కీలక పాత్ర పోషించాలి: కలెక్టర్



- ప్రజాస్వామ్య పటిష్టతకు ఆరోగ్యకర ఓటర్ల జాబితా కీలకం..
- జూన్ 15 నుంచి ఇంటింటి సర్వే.. సెప్టెంబర్ 22న తుది జాబితా
- అర్హుల చేరిక, అనర్హుల తొలగింపుతో స్వచ్ఛమైన ఓటర్ల జాబితా లక్ష్యం
- సర్ ప్రక్రియలో బీఎల్‌వోలు, క్షేత్రస్థాయి సిబ్బంది పాత్ర అత్యంత కీలకం

**విజయవాడ, (ఉషశ్రీ )జూన్ 9:** ప్రజాస్వామ్య వ్యవస్థ పటిష్టతకు దోషరహిత, ఆరోగ్యకరమైన ఓటర్ల జాబితా ఎంతో కీలకమని, ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియను అధికారులు, సిబ్బంది అత్యంత బాధ్యతాయుతంగా నిర్వహించాలని ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. జి. లక్ష్మీశ సూచించారు. విజయవాడలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళావేదికలో మంగళవారం నిర్వహించిన జిల్లాస్థాయి శిక్షణ కార్యక్రమంలో విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర, కలెక్టర్ పాల్గొని ఈఆర్‌వోలు, ఏఈఆర్‌వోలు, బీఎల్‌వోలు, బీఎల్‌వో సూపర్‌వైజర్లకు మార్గనిర్దేశం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సర్ ప్రక్రియలోని ఐదు దశలు, ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, స్వీకరణ, డిజిటైజేషన్, షెడ్యూల్ తదితర అంశాలను వివరించారు. జూన్ 15 నుంచి జులై 14 వరకు బీఎల్‌వోలు ఇంటింటి సర్వే నిర్వహిస్తారని, జులై 21న ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల చేస్తామని తెలిపారు. అనంతరం ఆగస్టు 20 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలు స్వీకరించి పరిశీలించిన తర్వాత సెప్టెంబర్ 22న తుది ఓటర్ల జాబితాను ప్రచురిస్తామని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో నమోదు కావడంతో పాటు, మృతులు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లినవారు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల పేర్లు ఉన్నవారి వివరాలను తొలగించడం ద్వారా స్వచ్ఛమైన ఓటర్ల జాబితా రూపొందించడమే సర్ ప్రక్రియ ప్రధాన లక్ష్యమని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ ప్రక్రియలో పారదర్శకతకు పెద్దపీట వేస్తున్నామని, రాజకీయ పార్టీలు, ఇతర భాగస్వామ్య పక్షాల సహకారంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. బూత్ స్థాయి అధికారులు ప్రతి ఇంటికీ వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, స్వీకరణ, డిజిటైజేషన్ పనులను పూర్తి చేయాలని, ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తూచా తప్పకుండా అమలు చేయాలని సూచించారు. సర్ ప్రక్రియ ఎన్నికల వ్యవస్థపై ప్రత్యక్ష ప్రభావం చూపే అత్యంత కీలక కార్యక్రమమని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని కలెక్టర్ లక్ష్మీశ స్పష్టం చేశారు. కార్యక్రమంలో డీఆర్‌వో ఎం. లక్ష్మీనరసింహం, విజయవాడ ఆర్‌డీవో వెన్నెల శ్రీను, జిల్లాలోని ఏడు నియోజకవర్గాల ఈఆర్‌వోలు, ఏఈఆర్‌వోలు, బీఎల్‌వోలు, బీఎల్‌వో సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.






# అన్నప్రసాదం, లడ్డు పోటు భవనాల నిర్మాణ పనుల పరిశీలన



**ఇంద్రకీలాద్రి, జూన్ 9:** దేవస్థానంలో నూతనంగా నిర్మిస్తున్న అన్నప్రసాదం భవనం, లడ్డు పోటు భవనాల నిర్మాణ పనులను ధర్మకర్తల మండలి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ), కార్యనిర్వహణాధికారి వి.కె. శీనా నాయక్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల పురోగతిపై ఆలయ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎల్. రమాదేవిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. పనుల నాణ్యతను పరిశీలించిన వారు నిర్ణీత గడువులోగా నిర్మాణాలను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు అందించేందుకు చేపడుతున్న ఈ నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని చైర్మన్, ఈవో ఆదేశించారు.

# వేద/స్మార్త పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**ఇంద్రకీలాద్రి, (ఉషశ్రీ ) జూన్ 9:** ఇంద్రకీలాద్రిలోని శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేద/స్మార్త పాఠశాలల్లో 2026-27 విద్యా సంవత్సరానికి నూతన ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానించనున్నట్లు దేవస్థానం ఈఓ శీనానాయక్ ఒక ప్రకటన లో తెలిపారు. పాఠశాలలో ఋగ్వేదం, కృష్ణ యజుర్వేదం, సామవేదం, అథర్వవేదం తదితర వేద విద్యలతో పాటు సాంప్రదాయ శాస్త్రాలను బోధించనున్నారు. ప్రవేశాలకు దరఖాస్తు చేసుకునే విద్యార్థులు ఆరోగ్యంగా ఉండి సంధ్యావందనం చేయగలగాలి. తెలుగు చదవడం, రాయడం తెలిసి ఉండాలి. స్మార్త విద్యకు 10 నుంచి 13 సంవత్సరాల వయస్సు, వేద విద్యకు 10 నుంచి 12 సంవత్సరాల వయస్సు కలిగి ఉండాలని అధికారులు పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులకు ఉచితంగా వసతి, భోజనం, వస్త్రాలు, వేద పుస్తకాలు అందించడంతో పాటు కోర్సు పూర్తిచేసి ఉత్తీర్ణులైన వారికి యోగ్యతా పత్రంతో పాటు రూ.3 లక్షల వరకు స్టైపెండ్ అందజేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు, తల్లిదండ్రులు మరిన్ని వివరాల కోసం పాఠశాల ప్రధానోపాధ్యాయులను 9440136924 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

# అడవి పంది అడ్డు రావడంతో ద్విచక్ర వాహనదారుడు మృతి



**కంభం, ఉషశ్రీ. కంభం:** మార్కాపురం జిల్లా కంభం మండలం నల్లకాలువ సమీపంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. గిద్దలూరు మండలం కృష్ణమూర్తిపల్లికి చెందిన భూపతి తిరుమలయ్య (40) వ్యక్తిగత పనులకోసం కంభం నుంచి గిద్దలూరుకు బైక్ పై వెళుతుండగా నల్లకాలువ వద్ద అకస్మాత్తుగా అడవి పంది రోడ్డుపైకి రావడంతో బైక్ అదుపుతప్పి కిందపడగా తిరుమలయ్య తలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స కోసం ఒంగోలుకు తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయాడు.

# కంభం చెరువు కట్టపై కనుల పండుగగా యోగా డే.!



**కంభం, ఉషశ్రీ. కంభం:** మార్కాపురం జిల్లా కంభం పట్టణంలో మంగళవారం యోగా డే కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం జిల్లా కలెక్టర్ విజయ సునీత, జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే ముత్తుముల ఆశోక్ రెడ్డి, డీఎస్పీ నాగరాజు, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, యోగా సాధకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అందరూ సామూహిక యోగా ప్రదర్శనలు నిర్వహించి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు

# పిజిఆర్ఎస్ ఫిర్యాదులపై వాస్తవ పరిష్కారం చేయాలి- డిపిఓ మల్లికార్జునరావు




**కైకలూరు ఉషశ్రీ:** పి జి ఆర్ ఎస్ ఫిర్యాదులపై వాస్తవాలు తెలుసుకొని ఫిర్యాదుదారున్ని కలిసి సమస్యను క్షేత్రస్థాయిలో పరిష్కరించాలని జిల్లా పంచాయతీ అధికారి మల్లికార్జునరావు ఆదేశించారు కైకలూరు మండల పరిషత్ కార్యాలయంలో కైకలూరు మండల పంచాయతీ కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కైకలూరు మండలం నుండి అధిక సంఖ్యలో ఫిర్యాదులు వస్తున్నాయని ఫిర్యాదులు పరిష్కారానికి పంచాయతీ కార్యదర్శులు వేగవంతమైన చర్యలు తీసుకొని పరిష్కరించాలని ఆయన అన్నారు అంతేకాకుండా ఇంటి పన్నులు మంచినీటి కొళాయి పనులు వసూళ్లలో నూరు శాతం పురోగతి సాధించాలని అన్నారు మండలంలో ఉన్న ప్రైవేటు పాఠశాలలు రైస్ మిల్లులు పరిశ్రమలు గుర్తించి వాటికి కమర్షియల్ పన్నులు విధించాలని దానికోసం ప్రభుత్వం నిబంధనలు మార్పు చేసిందని ప్రభుత్వం నిబంధనలకు అనుగుణంగా పన్నులు విధించాలని ఆయన పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు గ్రామాలలో వ్యర్థ పదార్థాలు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు డంపింగ్ యార్డ్ కి తరలించాలని అన్నారు . రానున్న వర్షాకాలంలో ప్రజలు అనారోగ్యాలు పాలు కాకుండా ఎక్కడ పారిశుధ్యం లోపించకుండా చూడాలని తాగునీరు శుద్ధిచేసి కుళాయిల ద్వారా అందించాలని శానిటేషన్ మెరుగుపరిచి గ్రామాల అభివృద్ధికి పంచాయతీ కార్యదర్శి తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో పంచాయతీ విస్తరణ అధికారి గంటా అప్పారావు పంచాయతీ కార్యదర్శులు సిబ్బంది పాల్గొన్నారు

# యోగాంధ్ర-2026కు భారీ స్పందన

**అమరావతి, (ఉషశ్రీ )జూన్ 9:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర-2026 కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ఈ నెల 7న ప్రారంభమైన రిజిస్ట్రేషన్లు కేవలం మూడు రోజుల్లోనే 5 లక్షల మార్కును దాటడం విశేషంగా నిలిచింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు యోగాసనాల్లో కోటి మందిని భాగస్వాములను చేయాలనే లక్ష్యంతో యోగాంధ్ర పోర్టల్ ద్వారా నమోదు ప్రక్రియ కొనసాగుతోంది. ఈమేరకు తొలి రోజు 25 వేల మంది మాత్రమే నమోదు చేసుకోగా, సోమవారం నుంచి రిజిస్ట్రేషన్ల సంఖ్య వేగంగా పెరుగుతూ ఐదు లక్షలకు చేరుకుంది.

**గుంటూరు జిల్లా ముందంజ:** రాష్ట్రంలో అత్యధికంగా గుంటూరు లో 98 వేల మంది తమ పేర్లు నమోదు చేసుకున్నారు. అనంతరం నెల్లూరు, నంద్యాల, కర్నూలు, పల్నాడు జిల్లాలు వరుసగా నిలిచాయి. యోగా సంఘాలు, గ్రామ, వార్డు సచివాలయాలు మరియు ఇతర వేదికల ద్వారా పెద్ద ఎత్తున నమోదు కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.

**లక్ష్యాన్ని దాటిన మాస్టర్ ట్రైనర్లు:** యోగాంధ్ర కార్యక్రమం కోసం 5,600 మంది యోగా మాస్టర్ ట్రైనర్లను నమోదు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించగా, ఇప్పటికే 6,939 మంది పేర్లు నమోదయ్యాయి. వైఎస్సార్ కడప జిల్లాలో 412 మంది, అనకాపల్లి లో 379 మంది, అనంతపురంలో 342 మంది, కర్నూల్ లో 310 మంది మాస్టర్ ట్రైనర్లు నమోదు చేసుకున్నారు.

**1.88 లక్షలకు చేరిన యోగా ట్రైనర్లు:** యోగా ట్రైనర్ల విభాగంలో 2.5 లక్షల మందిని నమోదు చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందనీ, ఇప్పటికే 1.88 లక్షల మంది తమ పేర్లు నమోదు చేసుకోగా, కడప జిల్లాలోనే అత్యధికంగా 9,013 మంది యోగా ట్రైనర్లు నమోదయ్యారని ఆయుష్ డైరెక్టర్ గోపాలకృష్ణ వెల్లడించారు. ప్రభుత్వం రూపొందించిన కార్యాచరణ ప్రకారం జిల్లాల వారీగా యోగాభ్యాస కార్యక్రమాలు, థీమ్ ఆధారిత యోగా ఈవెంట్లు, పోటీలు, అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా కొనసాగుతున్నాయని తెలిపారు.

**కోటి మంది లక్ష్యంగా ముందుకు:** ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా కనిపిస్తున్న ఉత్సాహాన్ని బట్టి త్వరలోనే కోటి మంది యోగాంధ్ర పోర్టల్‌లో నమోదు చేసుకునే అవకాశాలు ఉన్నాయని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలను ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో యోగాంధ్ర కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా పండుగ వాతావరణంలో నిర్వహిస్తున్నారు.

# రాష్ట్ర ఆర్థిక వృద్ధిని మరింత వేగవంతం చేయండి

- ఆర్థిక వృద్ధిపై నెలవారీ పర్యవేక్షణ తప్పనిసరి
- జీఎస్డీపీ లక్ష్యాల సాధనకు ప్రత్యేక కార్యాచరణ
- ఏఐ ఆధారిత మానిటరింగ్‌కు సీఎం ఆదేశాలు
- జీఎస్డీపీ లక్ష్యాలు, కేపీఐపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

**అమరావతి, (ఉషశ్రీ )జూన్ 9:** రాష్ట్ర ఆర్థిక వృద్ధిని మరింత వేగవంతం చేయడంతో పాటు జీఎస్డీపీ లక్ష్యాల సాధనకు డేటా ఆధారిత పర్యవేక్షణ వ్యవస్థను బలోపేతం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్డీపీ) లక్ష్యాలు, కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్ల (కేపీఐ) సాధనపై మంగళవారం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన కీలక సూచనలు చేశారు. రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిల్లో ఆర్థిక కార్యకలాపాలను అంచనా వేసేందుకు ప్రతి నెలా నిర్దిష్ట తేదీల్లో ఆర్థిక నివేదికలు సిద్ధం చేయాలని సీఎం సూచించారు. నెలవారీ, త్రైమాసిక, అర్ధ వార్షిక గణాంకాల ఆధారంగా వృద్ధి రేటును విశ్లేషిస్తే లక్ష్యాల సాధనలో ఎక్కడ వెనుకబాటుతనం ఉందో గుర్తించి వెంటనే చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

**జాతీయ సగటుకు మించి పనితీరు లక్ష్యం:** జాతీయ సగటు కంటే వెనుకబడిన సూచికలను గుర్తించి వాటి మెరుగుదలకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని సీఎం సూచించారు. అగ్రశ్రేణి రాష్ట్రాల స్థాయిలో అభివృద్ధి సూచికలను చేరుకునేలా అన్ని శాఖలు పనిచేయాలని ఆదేశించారు. నిర్దేశిత లక్ష్యాలతో పాటు వాస్తవ వృద్ధిని పరిగణనలోకి తీసుకుని శాఖల పనితీరును అంచనా వేసే విధంగా స్కోరింగ్ వ్యవస్థను అమలు చేయాలని సూచించారు.

**మౌలిక సదుపాయాలతో ఆర్థిక కార్యకలాపాల విస్తరణ:** రాష్ట్రంలో చేపడుతున్న మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు ఆర్థిక వ్యవస్థపై గణనీయ ప్రభావం చూపుతాయని సీఎం అభిప్రాయపడ్డారు. అమరావతి నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు, పోర్టులు, విమానాశ్రయాలు, పారిశ్రామిక పార్కులు, రవాణా రంగ అభివృద్ధి ద్వారా రాష్ట్రంలో ఆర్థిక కార్యకలాపాలు మరింత విస్తరించే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం చేపట్టే ప్రతి రూపాయి మౌలిక సదుపాయాల వ్యయం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో బహుళ ప్రభావం చూపేలా ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

**ఏఐ టాస్క్ ఫోర్స్ ఏర్పాటు:** రాష్ట్ర ఆర్థిక వ్యవహారాలపై రియల్ టైమ్ పర్యవేక్షణ కోసం కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. పన్నుల వసూళ్లు, రెవెన్యూ వృద్ధి, ఆర్థిక కార్యకలాపాల పురోగతి వంటి అంశాలను సాంకేతిక పరిజ్ఞానం ద్వారా నిరంతరం పర్యవేక్షించాలని చెప్పారు. జీఎస్టీతో పాటు ఇతర పన్నుల వసూళ్లలో సాంకేతికత వినియోగాన్ని మరింత పెంచి ఆదాయ వనరులను బలోపేతం చేయాలని స్పష్టం చేశారు.

**గ్రాస్ వాల్యూ అడిషన్ పెంపుపై దృష్టి :** తయారీ, గనులు, వాణిజ్యం, రవాణా, పర్యాటకం, వ్యవసాయం వంటి అన్ని రంగాల్లో గ్రాస్ వాల్యూ అడిషన్ (జీవీఏ) పెంచే చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం ఆదేశించారు. ప్రతి శాఖ తన పరిధిలో ఉత్పాదకత పెంపు, పెట్టుబడుల ఆకర్షణ, ఉపాధి సృష్టిపై దృష్టి సారించాలని సూచించారు.

**అధికారుల సామర్థ్యాల పెంపునకు వర్క్‌షాప్:** 2047 స్వర్ణాంధ్ర లక్ష్యాల సాధనలో అధికారుల పాత్ర కీలకమని పేర్కొన్న సీఎం, ప్రభుత్వ యంత్రాంగ సామర్థ్యాలను పెంపొందించేందుకు జూలై 2, 3 తేదీల్లో రాష్ట్రస్థాయి వర్క్‌షాప్ నిర్వహించాలని ఆదేశించారు. డేటా ఆధారిత పాలన, ఫలితాల ఆధారిత పరిపాలనపై అధికారులకు ప్రత్యేక శిక్షణ అందించాలని సూచించారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్, ఆర్థిక, ప్రణాళిక, వ్యవసాయ, ఉద్యాన, రవాణా, పర్యాటక శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## అంకాల ఆర్ట్స్ అకాడమీలో ఘనంగా “యోగాంధ్ర” కార్యక్రమం నిర్వహణ:జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ ఎ.శ్రీరామ్



**భీమవరం: (ఉషశ్రీ) జూన్ 9** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని భీమవరం పట్టణంలోని వీరమ్మ పార్కు సమీపంలో ఉన్న అంకాల ఆర్ట్స్ అకాడమీలో మంగళవారం “యోగాంధ్ర” కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ ఎ. శ్రీరామ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎ.శ్రీరామ్ మాట్లాడుతూ యోగాసనాలు మన శరీరానికి భౌతికంగా మాత్రమే కాకుండా మానసికంగా, అంతర్గత ఆరోగ్య పరంగా కూడా ఎంతో మేలు చేస్తాయని తెలిపారు. ఆధునిక జీవనశైలిలో ఒత్తిడులు, అనారోగ్య సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతిరోజూ కొంత సమయం యోగాకు కేటాయించడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవితం గడపవచ్చని పేర్కొన్నారు. యోగ సాధన ద్వారా శరీరానికి శక్తి, మనసుకు ప్రశాంతత, జీవన విధానంలో క్రమశిక్షణ అలవడతాయని ఆయన వివరించారు. ముఖ్యంగా యువత, మహిళలు, విద్యార్థులు యోగాను తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ శాఖకు చెందిన డాక్టర్లు టి. రామచంద్ర, డాక్టర్ కృష్ణ పాల్గొని వివిధ యోగాసనాల ప్రాధాన్యతను వివరించారు. అనంతరం మాస్టర్ ట్రైనర్లు యోగాసనాల ప్రదర్శనలు నిర్వహించగా, ట్రైనీలు వాటిని అభ్యసించారు. ఈ కార్యక్రమంలో 12 మంది మాస్టర్ ట్రైనర్లు, 18 మంది ట్రైనీలు మరియు ఆయుష్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# రైతులకు ఎరువుల కొరతకు చెక్

- ఆంధ్రప్రదేశ్ అగ్రికల్చర్ ఇన్ఫర్మేషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ తో డిజిటల్ పర్యవేక్షణ
- సకాలంలో యూరియా, డీఏపీ పంపిణీకి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు
- వెలగలేరులో ఎరువుల పంపిణీని పరిశీలించిన ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశా



**జి.కొండూరు, ఎన్టీఆర్ జిల్లా (ఉషశ్రీ )జూన్ 9:** రైతులకు అవసరమైన యూరియా, డీఏపీ వంటి సబ్సిడీ ఎరువులు సరైన సమయంలో, సరైన పరిమాణంలో అందేలా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధునిక సాంకేతికతను వినియోగిస్తోంది. ఇందుకోసం రూపొందించిన ఆంధ్రప్రదేశ్ అగ్రికల్చర్ ఇన్ఫర్మేషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఏపిఏఐఎంఎస్) యాప్ ద్వారా ఎరువుల పంపిణీ ప్రక్రియను పూర్తిగా డిజిటలైజ్ చేసి పారదర్శకతకు పెద్దపీట వేస్తోంది. ఈ విధానం రైతులకు నాణ్యమైన సేవలు అందించడంతో పాటు ఎరువుల దుర్వినియోగం, అక్రమ మళ్లింపులను అరికట్టడంలో కీలక పాత్ర పోషిస్తోందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశా తెలిపారు.

**ఎరువుల దుకాణంలో తనిఖీ:** జి.కొండూరు మండలం వెలగలేరు గ్రామంలోని శ్రీ సాయి ఎంటర్‌ప్రైజెస్ ఎరువుల దుకాణాన్ని కలెక్టర్ సందర్శించి ఏపిఏఐఎంఎస్ యాప్ ద్వారా జరుగుతున్న ఎరువుల పంపిణీ ప్రక్రియను పరిశీలించారు. రైతుల నమోదుతో పాటు వారి భూ వివరాలు, పంటల వివరాలు, అవసరమైన ఎరువుల పరిమాణం వంటి అంశాలను యాప్‌లో నమోదు చేసి పంపిణీ చేస్తున్న తీరును తెలుసుకున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎరువులు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

**ఏపిఏఐఎంఎస్ ప్రధాన లక్ష్యాలు:** వ్యవసాయ రంగంలో డిజిటల్ సంస్కరణలకు నాంది పలుకుతున్న ఏపిఏఐఎంఎస్ యాప్ ద్వారా రైతుల డిజిటల్ నమోదు, ధృవీకరణ, పంటల ఆధారిత ఎరువుల కేటాయింపు, రైతు సేవా కేంద్రాలు-డీలర్ల అనుసంధానం, ఎరువుల నిల్వలు మరియు అమ్మకాలపై రియల్‌టైమ్ పర్యవేక్షణ జరుగుతోంది. అలాగే సరఫరా గొలుసు మొత్తం ట్రాకింగ్ చేయడం, వ్యవసాయ శాఖ అధికారులకు డిజిటల్ నివేదికలు అందించడం, డేటా ఆధారిత నిర్ణయాలకు అవకాశం కల్పించడం ఈ వ్యవస్థ ప్రత్యేకతలు.

**రైతులకు కలిగే ప్రయోజనాలు:** ఈ విధానం ద్వారా అర్హులైన రైతులకు అవసరమైన ఎరువులు సకాలంలో అందుబాటులోకి వస్తాయి. సమీపంలోని అధీకృత డీలర్ల వద్ద నుంచే ఎరువులు కొనుగోలు చేసే అవకాశం కలుగుతుంది. ఎరువుల కొరత సమస్యలు తగ్గడంతో పాటు పంపిణీలో పారదర్శకత పెరుగుతుంది. రైతుల అవసరాలకు అనుగుణంగా ముందస్తు ప్రణాళికతో సరఫరా నిర్వహణ జరగడం వల్ల సాగు పనులకు ఆటంకాలు తగ్గనున్నాయి.

**బ్లాక్ మార్కెటింగ్‌కు అడ్డుకట్ట:** సబ్సిడీ ఎరువుల అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్, ఇతర ప్రాంతాలకు మళ్లింపులు వంటి సమస్యలను నివారించేందుకు ఏపిఏఐఎంఎస్ సమర్థవంతమైన ఆయుధంగా మారనుంది. ప్రతి బస్తా ఎరువు ఎక్కడికి చేరిందనే వివరాలు డిజిటల్ రూపంలో అందుబాటులో ఉండటం వల్ల జవాబుదారీతనం పెరుగుతుందని అధికారులు పేర్కొన్నారు.

**డిజిటల్ పాలనకు కొత్త దిశ:** ఎరువుల నిల్వలు, అమ్మకాలు, డిమాండ్ వివరాలు ఒకే వేదికపై అందుబాటులో ఉండటంతో ప్రభుత్వం మరింత సమర్థవంతమైన నిర్ణయాలు తీసుకునే అవకాశం ఏర్పడుతోంది. రైతు సంక్షేమం లక్ష్యంగా అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాలు క్షేత్రస్థాయిలో సక్రమంగా అమలవడానికి ఏపిఏఐఎంఎస్ కీలకంగా నిలుస్తుందన్నారు. ఈ తనిఖీ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి డి.ఎం.ఎఫ్. విజయకుమారి, జి.కొండూరు తహసీల్దార్ రాణి, మండల వ్యవసాయ అధికారి కె. చినసూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

# “వెన్నుపోటుకి రెండేళ్లు” పేరిట వైకాపా భారీ బహిరంగ సభ

- నల్ల బెలూన్లు ఎగురవేసి కూటమి ప్రభుత్వానికి నిరసన
- గత ప్రభుత్వ సంక్షేమం-ప్రస్తుత ప్రభుత్వ పాలనపై లబ్ధిదారుల విమర్శలు



**విజయవాడ, (ఉషశ్రీ )జూన్ 9:** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన నేపథ్యంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో “వెన్నుపోటుకి రెండేళ్లు” పేరిట మంగళవారం భవానీపురం ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్డులోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైకాపా ముఖ్య నేత, మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సభ ప్రారంభానికి ముందు ప్రస్తుత ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి నల్ల బెలూన్లను ఆకాశంలోకి ఎగురవేశారు. అనంతరం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సభలో పాల్గొన్న మహిళలు, వివిధ సంక్షేమ పథకాల లబ్ధిదారులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో తమకు అందిన ప్రయోజనాలను గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం పలు సంక్షేమ పథకాల అమలు నిలిచిపోవడం లేదా తగ్గిపోవడం వల్ల ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రస్తావించారు. గత ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలకు, ప్రస్తుత ప్రభుత్వ పాలనకు మధ్య ఉన్న తేడాలను వివరిస్తూ తమ అభిప్రాయాలను వెల్లడించారు. అనంతరం గత రెండేళ్ల కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో చోటుచేసుకున్న సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిణామాలను వివరిస్తూ ప్రత్యేకంగా రూపొందించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను ప్రదర్శించారు. ఈ ప్రజెంటేషన్ సభకు హాజరైన వారిలో చర్చనీయాంశంగా మారింది. ఈ సందర్భంగా మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని ఆరోపించారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందాయని, ప్రస్తుతం అనేక వర్గాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి మందగించిందని, ప్రజా సమస్యలు పెరిగాయని పేర్కొన్నారు. ప్రజల తరఫున ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎండి రూహుల్లా, మాజీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ అసిఫ్, మాజీ కార్పొరేటర్లు, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు, పార్టీ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ స్థాయి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# దళవాయ సుబ్బరామయ్య హైస్కూల్ నిర్మాణంలో జాప్యం

## విద్యారంగంపై ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం: కోటేశ్వరరావు




**విజయవాడ, (ఉషశ్రీ )జూన్ 9:** విద్యాధరపురం కుమ్మరిపాలెం సెంటర్‌లోని దళవాయి సుబ్బారామయ్య హై స్కూల్ పునర్నిర్మాణ పనులు నిలిచిపోవడం విద్యారంగంపై ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని సీపీఐ నగర కార్యదర్శి జీ . కోటేశ్వరరావు విమర్శించారు. పాఠశాల నిర్మాణంలో జరుగుతున్న జాప్యాన్ని నిరసిస్తూ సీపీఐ 38, 39 డివిజన్ల ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. విజయవాడలో విద్యాభివృద్ధికి విశేష సేవలందించిన దాత, ప్రజాహితవేత్త దళవాయ సుబ్బరామయ్య పేరిట ఈ పాఠశాల ఏర్పాటైందని తెలిపారు. 1930లో ప్రాథమిక పాఠశాలగా ప్రారంభమైన ఈ విద్యాసంస్థ 1970లో ఉన్నత పాఠశాలగా మారిందని, 2030 నాటికి శతాబ్ది ఉత్సవాలు జరుపుకోనున్నదని పేర్కొన్నారు. 2022లో ‘నాడు-నేడు’ పథకం కింద సుమారు రూ.3.15 కోట్ల వ్యయంతో 20 తరగతి గదుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. అప్పుడు 660 మంది విద్యార్థులు ఉండగా, నిర్మాణ పనుల కోసం వారిని తాత్కాలికంగా మరో పాఠశాలకు తరలించారని చెప్పారు. ప్రభుత్వం మారిన తర్వాత నిర్మాణ పనులు నిలిచిపోవడంతో విద్యార్థుల సంఖ్య 400కు పడిపోయిందని, దీంతో అనేక మంది ప్రభుత్వ విద్యకు దూరమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వెంటనే స్పందించి నిర్మాణ పనులను పునఃప్రారంభించి త్వరితగతిన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. అలాగే స్థానిక ఎమ్మెల్యే సుజనా చౌదరి చొరవ తీసుకుని పాఠశాల నిర్మాణాన్ని పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో పంచదార్ల దుర్గాంబ, కంచర్ల భార్గవ్, కంచర్ల నాగేశ్వరరావు, టి. పూర్ణయ్య, ఎర్రసాని జోసఫ్, అచ్యుత రంగారావు, గురజాల కొండలరావు, ఎ.వి.వి. కృష్ణకిషోర్, నారెండి కిషోర్, కోటా రాంబాబు, ఎన్. వెంకటేశ్వరరావు, ఎస్.కే. షంషుద్దీన్, మహమ్మద్ అలీ, పి. శ్రీను, కె. హుస్సేన్, అండిమాని నాగమణి, డి. దుర్గ, దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో రేపు పిడుగులతో కూడిన వర్షాలు..
## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: ప్రఖర్ జైన్

**రాష్ట్రంలో బుధవారం (జూన్ 10)** పలు జిల్లాల్లో పిడుగులు, ఈదురుగాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఇస్రా-ణహీూ) మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. వర్షాల సమయంలో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకుని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వాతావరణ శాఖ అంచనాల మేరకు అల్లూరి సీతారామరాజు, పశ్చిమగోదావరి, ఏలూరు, గుంటూరు, మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, వైఎస్సార్ కడప, చిత్తూరు జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. మిగిలిన జిల్లాల్లో కూడా అక్కడక్కడ తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వెల్లడించారు.

**పిడుగులు, ఈదురుగాలుల సమయంలో జాగ్రత్తలు తప్పనిసరి:** ఆకస్మికంగా ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు సంభవించే అవకాశం ఉన్నందున ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ప్రఖర్ జైన్ సూచించారు. వర్షం పడుతున్న సమయంలో చెట్ల కింద, విద్యుత్ స్తంభాల వద్ద, హోర్డింగులు, తాత్కాలిక షెడ్ల కింద ఆశ్రయం పొందకూడదన్నారు. పిడుగులు పడే ప్రమాదం ఉన్నందున బహిరంగ ప్రదేశాల్లో ఉండకుండా సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని కోరారు. వ్యవసాయ పనుల్లో నిమగ్నమై ఉన్న రైతులు, పశువులను మేపే పశు కాపరులు మరింత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఆకాశం మేఘావృతమై ఉరుములు వినిపించడం ప్రారంభమైన వెంటనే పొలాలు, బహిరంగ ప్రదేశాలను విడిచి భద్రమైన భవనాల్లోకి వెళ్లాలని సూచించారు. ఈదురుగాలుల ప్రభావంతో ఎక్కడైనా విద్యుత్ వైర్లు తెగిపడి ఉండే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. తెగిపోయిన విద్యుత్ తీగలను తాకకూడదని, వాటికి వీలైనంత దూరంగా ఉండి వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు.

**మరోవైపు పలు జిల్లాల్లో తీవ్ర ఎండలు:** వర్షాల హెచ్చరికలతో పాటు రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, పోలవరం, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 41 నుంచి 42 డిగ్రీల సెల్సియస్ మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందన్నారు. అదేవిధంగా శ్రీకాకుళం, అనకాపల్లి, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 40 నుంచి 41 డిగ్రీల సెల్సియస్ మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని తెలిపారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం తీవ్ర ఎండలు నమోదయ్యాయి. అనకాపల్లి జిల్లా మాకవరపాలెంలో అత్యధికంగా 42.7 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. విజయనగరం జిల్లా దత్తిరాజేరులో 42.4 డిగ్రీలు, పార్వతీపురం మన్యం జిల్లా భామినిలో 42.2 డిగ్రీలు, పశ్చిమగోదావరి జిల్లా తణుకులో 42 డిగ్రీలు నమోదయ్యాయి. అదేవిధంగా ఏలూరు జిల్లా కుక్కునూరు, పోలవరం జిల్లా కూనవరం, కాకినాడ జిల్లా పిఠాపురంలో 41.6 డిగ్రీలు, తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు, విశాఖపట్నం జిల్లా అక్కిరెడ్డిపాలెంలో 41.5 డిగ్రీల సెల్సియస్ గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు ప్రఖర్ జైన్ వెల్లడించారు.

**ప్రజలకు సూచనలు**

-పిడుగులు, ఉరుములు వినిపించిన వెంటనే సురక్షిత భవనాల్లోకి వెళ్లాలి.
-చెట్లు, విద్యుత్ స్తంభాలు, హోర్డింగుల కింద నిలబడకూడదు.
-రైతులు, పశుకాపరులు వాతావరణ పరిస్థితులను గమనిస్తూ పని చేయాలి.
-తెగిపోయిన విద్యుత్ తీగలకు దూరంగా ఉండాలి.
-అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటల మధ్య అవసరమైతే తప్ప బయటకు వెళ్లకూడదు.
-తగినంత నీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ వంటి ద్రవాలు తీసుకుంటూ ఎండల నుంచి జాగ్రత్త పడాలి.

రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఒకవైపు ఉరుములు, పిడుగులతో కూడిన వర్షాలు, మరోవైపు అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉన్నందున ప్రజలు వాతావరణ పరిస్థితులపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలని విపత్తుల సంస్థ విజ్ఞప్తి చేసింది.

# ఏపీకి పెట్టుబడుల వరద





- రెండేళ్లలో రూ.23 లక్షల కోట్ల ప్రతిపాదనలు.. 23 లక్షల ఉద్యోగాలపై ఆశలు
- 800 కంపెనీల ఆసక్తి.. పారిశ్రామిక రంగంలో కొత్త ఊపు

**అమరావతి, (ఉషశ్రీ ప్రతినిధి )జూన్ 9:** ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక రంగంలో కొత్త అధ్యాయం ప్రారంభమైనట్లు కనిపిస్తోంది. రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూల వాతావరణం కల్పించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించడంతో దేశీయ, అంతర్జాతీయ కంపెనీలు ఏపీ వైపు మొగ్గు చూపుతున్నాయి. గత రెండేళ్లలో సుమారు 800 కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి వ్యక్తం చేయగా, మొత్తం రూ.23 లక్షల కోట్ల విలువైన పెట్టుబడి ప్రతిపాదనలు వచ్చినట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. ఈ ప్రాజెక్టులు పూర్తిస్థాయిలో అమలైతే దాదాపు 23 లక్షల ఉద్యోగ అవకాశాలు సృష్టించబడే అవకాశం ఉంది.

**ఎంఓయూల రూపంలో రూ.21.64 లక్షల కోట్ల పెట్టుబడులు:** రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన భాగస్వామ్య సదస్సులు, పెట్టుబడిదారుల సమావేశాలు, అంతర్జాతీయ వ్యాపార వేదికలు, పారిశ్రామిక చర్చల ద్వారా భారీ స్థాయిలో అవగాహన ఒప్పందాలు (ఎంఓయూలు) కుదిరాయి. ఇప్పటివరకు రూ.21.64 లక్షల కోట్ల విలువైన ఎంఓయూలు కుదిరినట్లు ప్రభుత్వం చెబుతోంది. వీటి ద్వారా సుమారు 21.20 లక్షల ఉద్యోగాలు సృష్టించే అవకాశాలు ఉన్నాయని అంచనా వేస్తున్నారు. గతంలో ఎంఓయూలు కుదుర్చుకోవడమే ప్రధానంగా ఉండేదనే విమర్శలు వినిపించేవి. అయితే ఈసారి ఒప్పందాలు కేవలం కాగితాలకే పరిమితం కాకుండా ప్రాజెక్టుల అమలుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టినట్లు అధికారులు చెబుతున్నారు.

**అమలు దిశగా 68 శాతం ప్రాజెక్టులు:** ప్రస్తుతం కుదిరిన ఎంఓయూలలో గణనీయమైన పురోగతి నమోదైనట్లు ప్రభుత్వ గణాంకాలు సూచిస్తున్నాయి. మొత్తం ఒప్పందాల్లో 68.02 శాతం ప్రాజెక్టులు ఇప్పటికే వివిధ దశల్లో అమలు ప్రక్రియలోకి ప్రవేశించాయి. డీపీఆర్ (డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్) సమర్పణ నుంచి గ్రౌండింగ్ దశ వరకు చేరిన ప్రాజెక్టులు 60.44 శాతంగా ఉన్నాయి. అలాగే భూ కేటాయింపులు పూర్తిచేసుకున్న ప్రాజెక్టులు 21.39 శాతంగా నమోదయ్యాయి. పెట్టుబడుల ప్రపంచంలో సాధారణంగా ప్రాజెక్టులు కార్యరూపం దాల్చడానికి ఎక్కువ సమయం పడుతుంది. అలాంటి పరిస్థితుల్లో పెద్ద మొత్తంలో ఎంఓయూలు అమలు దశలోకి చేరడం కీలక పరిణామంగా భావిస్తున్నారు.

**ప్రత్యేక పర్యవేక్షణతో వేగవంతమైన అమలు:** పెట్టుబడుల అమలును వేగవంతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేసింది. ప్రతి ప్రధాన ప్రాజెక్టుకు సంబంధించి పురోగతిని నిరంతరం సమీక్షించే విధానం అమలులో ఉంది. మూడు ప్రాంతాలకు ప్రత్యేక నోడల్ అధికారులను నియమించడంతో పాటు, జిల్లా కలెక్టర్లకు కూడా స్పష్టమైన బాధ్యతలు అప్పగించారు. అంతేకాకుండా భూ కేటాయింపులు, విద్యుత్, నీటి వసతులు, అనుమతులు, పర్యావరణ క్లియరెన్స్ వంటి అంశాల్లో ఆలస్యం లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచనలు జారీ చేసినట్లు సమాచారం. పరిశ్రమలు త్వరగా కార్యకలాపాలు ప్రారంభించేలా అన్ని శాఖల మధ్య సమన్వయం పెంచే ప్రయత్నాలు జరుగుతున్నాయి.

**దేశవ్యాప్తంగా చర్చకు దారి తీస్తున్న ఏపీ:** ఇటీవలి కాలంలో పెట్టుబడుల విషయంలో ఆంధ్రప్రదేశ్ పేరు జాతీయ స్థాయిలో చర్చకు వస్తోంది. గత కొన్నేళ్లలో ఇతర రాష్ట్రాలను పరిశీలించిన కొన్ని కంపెనీలు ప్రస్తుతం ఏపీని ప్రాధాన్యంగా ఎంచుకోవడం గమనార్హంగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమల కోసం భూమి, మౌలిక వసతులు, వేగవంతమైన అనుమతులు, విధానపరమైన స్పష్టత కల్పిస్తోందని పారిశ్రామిక వర్గాలు పేర్కొంటున్నాయి.

**భారీ ప్రాజెక్టులకు కేంద్రంతో సమన్వయం:** పారిశ్రామిక పెట్టుబడులను ఆకర్షించడంలో కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం కీలకంగా మారింది. కొన్ని ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుల విషయంలో అవసరమైన విధానపరమైన మద్దతు కోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో నిరంతరం సంప్రదింపులు కొనసాగిస్తోంది. గూగుల్ డేటా సెంటర్ వంటి భారీ ప్రాజెక్టులను రాష్ట్రానికి తీసుకురావడానికి అవసరమైన నిబంధనల సవరణలపై చర్చలు జరిగాయి. అలాగే ఆర్సెలార్ మిట్టల్ ప్రాజెక్టుకు అవసరమైన మౌలిక వసతుల కల్పనపై కూడా ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

**36 రోజుల్లోనే కార్యరూపం దాల్చిన ఏఎంసీఏ ప్రాజెక్టు:** రాష్ట్రంలో పారిశ్రామిక ప్రాజెక్టుల అమలులో వేగానికి ఏఎంసీఏ ప్రాజెక్టు ఉదాహరణగా నిలుస్తోంది. కేవలం 36 రోజుల్లోనే ఈ ప్రాజెక్టు కీలక అనుమతులు పొంది అమలు దశలోకి ప్రవేశించడం విశేషంగా చెప్పబడుతోంది. పరిశ్రమలకు సంబంధించిన ఫైళ్ల పరిష్కారంలో వేగం పెరగడం వల్లే ఇది సాధ్యమైందని అధికారులు చెబుతున్నారు.

**ఎఫ్‌డీఐలలో ఏపీ వాటా పెరుగుదల:** విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఖీణ×) ఆకర్షణలో కూడా రాష్ట్రం పురోగతి సాధిస్తున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. దేశానికి వచ్చిన మొత్తం ఎఫ్‌డీఐల్లో 25.3 శాతం ఆంధ్రప్రదేశ్‌కు వచ్చినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఇది పారిశ్రామిక పెట్టుబడిదారుల్లో రాష్ట్రంపై పెరుగుతున్న నమ్మకానికి సూచికగా భావిస్తున్నారు. పెట్టుబడుల గమ్యంగా ఆంధ్రప్రదేశ్ మారుతుందని విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. పారిశ్రామిక విధానాలు, మౌలిక సదుపాయాల విస్తరణ, ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థ, పెట్టుబడిదారులతో నిరంతర సంప్రదింపులు వంటి చర్యలతో ఆంధ్రప్రదేశ్ దేశంలోని ప్రముఖ పెట్టుబడి గమ్యస్థానాల్లో ఒకటిగా ఎదుగుతోందని పారిశ్రామిక వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

**యువతకు ఉద్యోగాలపై భారీ ఆశలు:** ఇప్పటికే ప్రాసెస్‌లోకి వచ్చిన ప్రాజెక్టులు పూర్తిస్థాయిలో కార్యరూపం దాల్చితే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థతో పాటు యువత ఉపాధి అవకాశాల్లో కూడా గణనీయమైన మార్పు కనిపించే అవకాశం ఉంది. పెట్టుబడుల వల్ల రాష్ట్రంలో ఉద్యోగ అవకాశాలు గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా తయారీ, డేటా సెంటర్లు, పునరుత్పాదక ఇంధనం, ఎలక్ట్రానిక్స్, ఉక్కు, లాజిస్టిక్స్, ఆహార ప్రాసెసింగ్ వంటి రంగాల్లో పెద్ద సంఖ్యలో ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ప్రత్యక్ష ఉద్యోగాలతో పాటు పరోక్ష ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని నిపుణులు అంచనా వేస్తున్నారు.



# 392 వైద్యుల పోస్టింగులకు వెబ్ కౌన్సెలింగ్

- తొలిసారిగా పారదర్శక విధానం
- 20లోగా విధుల్లో చేరాలని ఆదేశాలు

**అమరావతి, (ఉషశ్రీ ) జూన్ 9:** జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్ఎం) ద్వారా ఎంపికైన 392 మంది మెడికల్ ఆఫీసర్లకు తొలిసారిగా వెబ్ కౌన్సెలింగ్ ద్వారా పోస్టింగులు ఇవ్వనున్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. పారదర్శకత, మానవ జోక్యానికి తావులేని విధానంలో ఈ ప్రక్రియను అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. ఏపీ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు నిర్వహించిన ఎంపిక ప్రక్రియలో మెరిట్ ఆధారంగా ఎంపికైన ఎంబీబీఎస్ వైద్యులకు ఆరు విభాగాల్లో పోస్టింగులు కేటాయించనున్నారు. మొత్తం 392 పోస్టుల్లో పట్టణ ఆరోగ్య కేంద్రాలకు 173, ఎన్సీడీ క్లినిక్‌లకు 99, నవజాత శిశు సంరక్షణ కేంద్రాలకు 70, న్యూట్రిషన్ రిహాబిలిటేషన్ సెంటర్లకు 12, టెలీమెడిసిన్ హబ్‌లకు 25, జిల్లా ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్లకు 13 పోస్టులు ఉన్నాయి. ఇంతకుముందు జూమ్ ద్వారా నిర్వహించే కౌన్సెలింగ్‌లో అభ్యర్థులు సాంకేతిక సమస్యలు ఎదుర్కొనేవారని, కొత్త వెబ్ కౌన్సెలింగ్ విధానంలో అన్ని ఖాళీలకు ఒకేసారి ఆప్షన్లు నమోదు చేసుకునే అవకాశం కల్పించినట్లు మంత్రి తెలిపారు. అభ్యర్థుల మెరిట్, వారు ఇచ్చిన ఆప్షన్ల ఆధారంగా పోస్టింగులు స్వయంచాలకంగా కేటాయించబడతాయని చెప్పారు. ఆప్షన్ల నమోదు ప్రక్రియ బుధవారంతో ముగియనుండగా, ఈ నెల 12న పోస్టింగ్ ఉత్తర్వులు జారీ చేసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. పోస్టింగులు పొందిన వైద్యులు జూన్ 20వ తేదీలోగా విధుల్లో చేరాలని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్, ఎన్‌హెచ్ఎం డైరెక్టర్ జి. వీరపాండియన్ స్పష్టం చేశారు. కొత్తగా నియమితులయ్యే వైద్యుల సేవలతో పట్టణ ఆరోగ్య కేంద్రాలు, ఎన్సీడీ క్లినిక్‌లు, నవజాత శిశు సంరక్షణ కేంద్రాలు, టెలీమెడిసిన్ సేవలు మరింత బలోపేతం అవుతాయని ఆరోగ్య శాఖ అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# వర్జీనియా పొగాకు కొనుగోళ్లకు ఊపు



**అమరావతి, (ఉషశ్రీ )జూన్ 9:** వర్జీనియా పొగాకు రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. రైతులకు గిట్టుబాటు ధరలు అందేలా, కొనుగోళ్లు వేగవంతం అయ్యేలా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్ర ప్రభుత్వం, పొగాకు బోర్డు అధికారులతో నిరంతరం సమన్వయం చేస్తున్నారని చెప్పారు. గత 15 రోజుల క్రితం మార్కెట్‌లో రోజుకు సుమారు 150 బేళ్ల కొనుగోళ్లు మాత్రమే జరుగగా, ప్రభుత్వం తీసుకున్న చర్యలు, రైతులు-కొనుగోలు సంస్థల మధ్య సమన్వయం కారణంగా ప్రస్తుతం రోజువారీ కొనుగోళ్లు 700 బేళ్లకు పెరిగినట్లు తెలిపారు. ఇదే ధోరణి కొనసాగితే వచ్చే వారం రోజుల్లో రోజుకు 1000 నుంచి 1200 బేళ్ల వరకు కొనుగోళ్లు చేరుకునే అవకాశం ఉందన్నారు. పొగాకు బోర్డు ఆధ్వర్యంలో రైతులు, కొనుగోలు సంస్థలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి మార్కెట్ పరిస్థితులు, కొనుగోళ్ల పురోగతి, ఎగుమతుల స్థితిగతులపై చర్చించినట్లు మంత్రి వెల్లడించారు. కంపెనీలు అవసరమైన గ్రేడ్ల వివరాలను వెల్లడించగా, వాటి ఆధారంగా వారంవారీ కొనుగోలు లక్ష్యాలు నిర్ణయించినట్లు చెప్పారు. రైతులు అన్ని గ్రేడ్ల పొగాకును ఒకేసారి మార్కెట్‌కు తీసుకురావాలని సూచించారు. ప్రస్తుతం దేశంలో ఉత్పత్తి అయ్యే పొగాకులో 70 శాతం ఎగుమతులు జరుగుతున్నాయని, అంతర్జాతీయ పరిస్థితులు, మధ్యప్రాచ్య ఉద్రిక్తతలు, షిప్పింగ్ కంటైనర్ల కొరత కారణంగా ఎగుమతుల రంగం ఒత్తిడిని ఎదుర్కొంటోందని తెలిపారు. కంటైనర్ రవాణా ఖర్చు 1600 డాలర్ల నుంచి 4000 డాలర్లకు పెరిగినట్లు పేర్కొన్నారు. ఎగుమతిదారులకు వడ్డీ రాయితీ (ఇంట్రెస్ట్ సబ్‌వెన్షన్) కల్పించాలన్న రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనపై కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని మంత్రి వెల్లడించారు. రైతులు, కంపెనీలు, ఎగుమతిదారులు సమన్వయంతో పనిచేస్తేనే ప్రస్తుత సవాళ్లను అధిగమించగలమని, రైతుల ప్రయోజనాల పరిరక్షణే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.

# బి ఎల్ ఓ లు ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించాలి: జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి




**భీమవరం: (ఉషశ్రీ) జూన్ 9** భీమవరం మున్సిపల్ కార్యాలయం కౌన్సిల్ హాల్ నందు మంగళవారం భీమవరం నియోజకవర్గం ఓటర్ల జాబితా సవరణపై (సర్ ) బిఎల్ఓ లకు ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పోలింగ్ స్టేషన్ వారిగా భీమవరం, వీరవాసరం మండలాలకు నియమించిన బిఎల్ఓ లతో మ్యాపింగ్ పై సమీక్షించారు. భీమవరం అర్బన్ మండలంలో 55.54 శాతం, రూరల్ లో 63 శాతం, వీరవాసరం మండలంలో 64 శాతం, మొత్తం నియోజకవర్గ పరిధిలో 59.98 శాతం మ్యాపింగ్ ప్రక్రియ పూర్తయింది అన్నారు. ఇంకా సుమారు 40 శాతం మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి కావాల్సి ఉందని, వేరే ప్రాంతాలకు మారిన, ఇతరత్రా కారణాలతో ఆ నివాసంలో లేకపోతే విచారించి మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. అలాగే కొన్ని పోలింగ్ స్టేషన్లు పరిధిలో బిఎల్ఓ లు 95% పైబడి మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేయడాన్ని పరిశీలించి వారిని అభినందిస్తూ, ఆ బిఎల్ఓ లను ఆదర్శంగా తీసుకుని మ్యాపింగ్ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలి అన్నారు. జవాబుదారీతనంతో పనిచేయాలని, అంకితభావంతో పనిచేస్తే సాధ్యం కానిది ఏమీ లేదని హితవు పలికారు. బూత్ లెవల్ అధికారులు (దీూాలు) తమ విధులను పూర్తి పారదర్శకతతో నిర్వహించాలని, 2002 ఓటర్ల జాబితా మరియు 2025 తాజా జాబితాలను ఆధారంగా తీసుకుని మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. ఇంటింటి సర్వేలో భాగంగా ప్రతి ఇంటికీ వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేయాలని, అవసరమైన ఫారం-6, ఫారం-7, ఫారం-8 తదితర దరఖాస్తు పత్రాలను బిఎల్వోలు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో గరిష్టంగా వెయ్యి మంది ఓటర్లకు మాత్రమే పరిమితం ఉండేలా నిబంధనల ప్రకారం హేతుబద్ధీకరణ చేపట్టాలని తెలిపారు. ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం షెడ్యూల్‌ను వివరిస్తూ, జూన్ 5 నుండి 14 వరకు శిక్షణ మరియు ప్రింటింగ్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జూన్ 15 నుండి జూలై 14 వరకు బూత్ లెవల్ అధికారులు ఇంటింటి సర్వే నిర్వహిస్తారని చెప్పారు. జూలై 21న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించబడుతుందని, జూలై 21 నుండి ఆగస్టు 20 వరకు క్లెయిమ్స్ మరియు అభ్యంతరాల స్వీకరణ జరుగుతుందని తెలిపారు. అనంతరం సెప్టెంబర్ 22న తుది ఓటరు జాబితా విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. ఓటరు నమోదుకు సంబంధించి అవసరమైన పత్రాలపై కూడా కలెక్టర్ వివరణ ఇచ్చారు. 01.07.1987కు ముందు జన్మించినవారు, 01.07.1987 నుండి 02.12.2004 మధ్య జన్మించినవారు, అలాగే 02.12.2004 తర్వాత జన్మించినవారికి వేర్వేరు ధృవపత్రాలు అవసరమవుతాయని తెలిపారు. జనన ధృవపత్రం, విద్యా ధృవపత్రాలు, పాస్‌పోర్ట్, ఆధార్ కార్డు, ప్రభుత్వ ఉద్యోగ గుర్తింపు కార్డులు తదితర పత్రాలను వినియోగించవచ్చు అన్నారు. ఇంటింటి సర్వే ద్వారా డూప్లికేట్ ఓటర్లు, మరణించినవారి పేర్లు, ఇతర ప్రాంతాలకు మారిన ఓటర్ల వివరాలను సేకరించి జాబితా శుద్ధి చేపడతామని తెలిపారు. ముఖ్యంగా 18 సంవత్సరాలు పూర్తిచేసుకున్న యువత, మహిళలు, దివ్యాంగులు, వలస కార్మికులు వంటి వర్గాల ఓటరు నమోదుపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు చెప్పారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో సర్ ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జూన్ 15 నుండి జూలై 14 వరకు బూత్ లెవల్ అధికారులు నిర్వహించనున్న ఇంటింటి సర్వేకు సంబంధించిన కిట్లను జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సమావేశంలో భీమవరం ఆర్డీవో మరియు మున్సిపాలిటీ ప్రత్యేక అధికారి కే.ప్రవీణ్ కుమార్ రెడ్డి, భీమవరం మున్సిపాలిటీ సహాయ కమిషనర్ ఏ రాంబాబు, తహసిల్దార్లు రావి రాంబాబు, రామాంజనేయులు, బి ఎల్ వోలు, తదితరులు పాల్గొన్నారు.

# ఇందుకూరు కాలేజీ విద్యార్థులకు హాస్టల్ సౌకర్యం




**పోలవరం జిల్లా దేవీపట్నం మండలం ఉష శ్రీ ప్రతినిధి వెంకట్ 09.06.2026:** పోలవరం ప్రాజెక్టు నిర్మాణం నిమిత్తం పలు గ్రామాలను ప్రభుత్వ కార్యాలయాలను ఇందుకూరు ఇందుకూరుపేట పరిసర ప్రాంతాలకు తరలించడం జరిగినది దీనిలో భాగంగానే దేవీపట్నం లో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఇందుకూరు హైస్కూల్ నందు ఏర్పాటు చేయడం జరిగినది ఇదే హై స్కూల్ నందు కాలేజీ కొరకు నూతన బిల్డింగు నిర్మాణం పనులు వేగవంతంగా జరుగుతున్నాయి ఈ కాలేజీలో విద్యార్థులకు సీఈసీ, ఎంపీసీ, బైపిసి,,హెచ్ ఈ సి గ్రూపులకు విద్యార్థినీ విద్యార్థులకు విద్యాబోధన చేయడం జరుగుతుంది దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు ఇబ్బంది లేకుండా ఉండటం కోసం బాలురకు ప్రత్యేకంగా హాస్టల్ వసతి సౌకర్యం ఏర్పాటు చేయడం జరుగుతున్నది ఈ వసతి సౌకర్యం ఏర్పాటు చేయడం వల్ల పేద విద్యార్థులకు దూర ప్రాంతంలో వెళ్లే ఇబ్బంది లేకుండా ఇక్కడే విద్యాభ్యాసం చేసి వసతి గృహం లో ఉండే సౌకర్యం ఏర్పాటు చేయడం జరుగుతుందని, సీనియర్ అధ్యాపకులచే ఉత్తమ బోధన అందించడం జరుగుతుందని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కె.శ్రీనివాసరావు, హాస్టల్ వెల్ఫేర్ అధికారి పచ్చు కూరు అర్జునుడు తెలిపారు.

# పట్టా భూములలో జోరుగా మట్టి తవ్వకాలు....





**ఉష శ్రీ ఆర్ సి ఇంచార్జి కనిగిరి యాటా రాఘవేంద్ర:** అనుమతులు లేవు... నిబంధనలు అసలే లేవు: పట్టా భూములలో జోరుగా మట్టి తవ్వకాలు అధికార యంత్రాంగం నిమ్మకు నీరుత్తినట్లు వ్యవహరించడంతో, కొందరు అక్రమార్కులు పట్టాదారుల పొలాలలో యదేచ్ఛగా మట్టి తవ్వకాలు జరుపుతున్నారు. ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా నిబంధనలను కాటేస్తూ రాత్రి పగలు తేడా లేకుండా సాగుతున్న ఈ దందాపై స్థానిక రైతులు, ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు..

**రైతులు ఆవేదన,నాశనం అవుతున్న పంట పొలాలు:** నిజానికి వ్యవసా యనికంగా అనుకూలంగా ఉండే ఈ విలువైన మెయిల్ రకం మట్టిని కొందరు భూస్వాములు మరియు దలరులును కలిసి గుట్టు చప్పుడు కాకుండా తరలిస్తున్నారు. జెసిబి లతో భారీగా తవ్వకాలు జరపడం వల్ల పక్కనే ఉన్న ఇతర రైతుల పొలాలు కూడా దెబ్బతిని ప్రమాదం ఏర్పడింది. భూగర్భ జలాలు పడిపోవడంతో పాటు, వర్షాలు వస్తే ఈ లోతైన గోతులు చెరువులను తలపించి పశువులకు మనుషులకు ప్రాణ సంకటనగా మారేలా ఉన్నాయి.

**రాత్రి వేళలోనే అసలు దందా:** పగటిపూట నిఘా ఉంటుందని నెపంతో, అర్ధరాత్రి వేళలో భారీ యంత్రలతో మట్టిని తవ్వి, టిప్పర్ల ట్రాక్టర్లతో ద్వారా రియల్ ఎస్టేట్ వెంచర్లకు తరలిస్తున్నట్టు సమాచారం. వందలాది లారీలు మట్టిని తరలిపోతున్న మైనింగ్ రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం. కళ్ళ ముందు ఇంత అక్రమం జరుగుతున్న అడిగే దిక్కులేదు లారీల దాటికి గ్రామీణ రోడ్లు కూడా ధ్వంసం అయిపోతున్నాయని

**ఒక స్థానిక రైతు ఆవేదన:** తక్షణమే జిల్లా ఉన్నంత అధికారులు స్పందించి ఈ అక్రమం మట్టి తవ్వకలను అడ్డుకోవాలని బాధ్యులైన వారిపై పై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో బాధితులు కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరిస్తున్నారు........

# పామూరు తహసిల్దారుగా ఆనాటి లక్ష్మీనారాయణ బాధ్యతలు స్వీకరణ.



**ఉష శ్రీ ఆర్ సి ఇంచార్జి కనిగిరి యాటా రాఘవేంద్ర.** పామూరు మండల నూతన తహసిల్దార్ గా ఆనాటి లక్ష్మీనారాయణ స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో అధికారకంగా బాధ్యతలు స్వీకరించారు. బదిలీపై వచ్చిన ఆయనకు స్థానిక కార్యాలయం సిబ్బంది రెవెన్యూ అధికారులు ఘన స్వాగతం పలికారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని రెవెన్యూ పాలన మరింత చేరువ చేస్తానని అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు రెవెన్యూ సేవలు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటానని చెప్పారు. భూ సమస్యలు వీఆర్వో వీఆర్ఐ పరిధిలోని అర్జీ లను ఎప్పటికప్పుడు పరిశీలించి పెండింగ్ సమస్యలను వేగంగా పరిష్కరిస్తామని తెలిపారు. కార్యాలయానికి వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా సిబ్బంది అంతా సమయపాలన పాటించాలని ఆదేశించారు. రెవెన్యూ సేవలకు కు పెద్దపీట వేస్తామని అవినీతికి తావు లేకుండా విధులు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ముఖ్యంగా రైతాంగానికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా వారి సమస్యలను వేగంగా పరిష్కరిస్తానని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ సీనియర్ అసిస్టెంట్, గ్రామాల రెవెన్యూ అధికారులు, గ్రామాల సర్వే అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొని నూతన తహసిల్దార్ ని పూలమాలలు వేసి దుశాల్వాతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు.

## విద్యార్థిని మాధురికి అండగా నిలిచిన చిన్న శ్రీను



**పద్మనాభం, ఉష శ్రీ:** భీమిలి నియోజకవర్గం పద్మనాభం గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త దివంగత కంటుబొొతు శ్రీను ప్రమాదవశాత్తు మృతి చెందిన విషయం తెలిసిందే. వారి కుటుంబ పరిస్థితిని గుర్తించిన విజయనగరం జిల్లా జడ్పీ చైర్మన్, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త శ్రీ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) మానవతా దృక్పథంతో ముందుకు వచ్చి వారి కుమార్తె కంటుబొొతు మాధురిని శ్రీ చైతన్య జూనియర్ కళాశాల, బోయపాలెంలో ఇంటర్ విద్య కోసం చేర్పించారు. అంతేకాకుండా విద్యాభ్యాసానికి అవసరమైన రూ.1,10,000 ఫీజును కూడా స్వయంగా చెల్లించి కుటుంబానికి అండగా నిలిచారు. ఈ నేపథ్యంలో నేడు కంటుబొొతు మాధురి, ఆమె తల్లి చిన్న శ్రీను మరియు వారి కుమార్తె మజ్జి సిరి సహస్ర (సిరమ్మ)ను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా చిన్న శ్రీను మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తు కోసం తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తానని, మాధురి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పద్మనాభం ఎంపీపీ కంటుబొొతు రాంబాబు, పద్మనాభం సర్పంచ్ తాలాడ పద్మనాభం ఇతర ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఇంజినీర్ల ఆలోచనతోనే దేశానికి మార్పు

- నెలాఖరులోగా జలధార పనులన్నీ శతశాతం పూర్తికావాలి
- చెరువులను కాపాడాల్సిన బాధ్యత ఇంజినీర్లదే
- ఎల్ నినో ప్రభావంపై ప్రతి రైతుకు అవగాహన కల్పించాలి
- పాత పద్ధతులు వీడి త్రీ-డి మ్యాపింగ్ లను వాడాలి
- జిల్లా కలెక్టర్ డా. ఎన్. ప్రభాకర రెడ్డి స్పష్టీకరణ




**పార్వతీపురం ఉష శ్రీ జి.ఎస్ ఆర్ సిహెచ్ మూర్తి, జూన్ 9 :** ఇంజినీర్ల వినూత్న ఆలోచనలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించినప్పుడే క్షేత్రస్థాయిలో ఆశించిన మార్పు సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి అభిప్రాయపడ్డారు. జిల్లాలో చేపట్టిన జలధార పనులను పూర్తిచేసేందుకు వచ్చే నెల 10 వరకు గడువు ఉన్నప్పటికీ, ఈ నెలాఖరులోగా శత శాతం పనులు పూర్తికావాలని ఆదేశించారు. చెరువులు ఆక్రమణకు గురికాకుండా చూడాల్సిన బాధ్యత ఇంజనీర్లపై ఉందని, కావున చెరువు గట్లపై ఫలసాయం మొక్కలను వేసి, ఆదాయం వచ్చేలా ఆలోచనలు చేయాలన్నారు. ఈ ఏడాది ఎల్ నినో ప్రభావం ఉంటుందన్న హెచ్చరికల నేపథ్యంలో రైతులను అప్రమత్తం చేస్తూ, దీనిపై అవగాహన కల్పించాలని సూచించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇరిగేషన్ శాఖ అధికారులు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, అసిస్టెంట్ ఇంజినీర్లతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ?ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ఎల్ నినో ప్రభావంపై ప్రతి రైతుకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. అలాగే క్షేత్రస్థాయి పర్యటనల్లో ప్రోటోకాల్ పాటించని అధికారులపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మండలాల పర్యటనకు వెళ్ళినప్పుడు ఏఈ, డిఈలు కచ్చితంగా కలిసి ఉండాలని, కొందరు అధికారులు విధుల్లో కనిపించకపోవడం వారి అలసత్వానికి నిదర్శనమని, ఇకపై ఇటువంటివి సహించేది లేదని కలెక్టర్ హెచ్చరించారు. ?ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) ద్వారా వచ్చే ఇరిగేషన్ ఫిర్యాదులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి మండలంలో ప్రజలు అడుగుతున్న సమస్యలను ఒక సమగ్ర ఎక్సెల్ షీట్ లో పాయింట్ వైజ్ నమోదు చేయాలన్నారు. సమస్యకు గల క్షేత్రస్థాయి వాస్తవాలు, దానికి కావలసిన నిధులు, అంచనా నివేదికలు మరియు తీసుకోవాల్సిన, తీసుకున్న చర్యలను సమగ్రంగా సిద్ధం చేయాలన్నారు. సోమవారం గ్రీవెన్స్ సమయానికి మండలాల వారీగా పెండింగ్ సమస్యల నివేదిక సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు.

**నీటి సంఘాల సాయంతో 'నీటి క్రమబద్ధీకరణ:** సమావేశంలో నీటి క్రమబద్ధీకరణ మరియు సాగునీటి పంపిణీపై కలెక్టర్ సుదీర్ఘంగా చర్చించారు. షట్టర్లు సరిగ్గా లేని చోట తక్షణమే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి, చివరి ఆయకట్టు రైతు వరకు నీరు అందేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా అధికారులు స్పందిస్తూ, క్షేత్రస్థాయిలో నీటి సంఘాల సాయంతో రైతులను భాగస్వామ్యం చేస్తూ, గొడవలు లేకుండా 4 నెలల పాటు సాగునీటిని అందిస్తున్నామని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. రైతుల నుండి స్పందన తీసుకుని, అందుబాటులో ఉన్న బడ్జెట్‌లోనే ప్రాధాన్యత క్రమంలో పనులను పూర్తిచేస్తున్నట్లు వివరించారు. ?ఇరిగేషన్ శాఖలో ఇంకా పాత పద్ధతులను వాడటంపై కలెక్టర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. గూగుల్ మ్యాప్స్ కంటే వేగంగా పనిచేసే ఆధునిక డిజిటల్ అప్లికేషన్లు, ఎంకార్డ్ వంటి సాంకేతికతను వాడుకోవాలని ఆధునిక సాంకేతికత - త్రీ-డి (3ల) మ్యాపింగ్ వినియోగించాలని సూచించారు. రీ-సర్వే పూర్తయిన గ్రామాల్లో ప్రతి పొలం యజమాని యొక్క జియో కోఆర్డినేట్ లభ్యమవుతున్నందున, దీని సహాయంతో మీ ఇరిగేషన్ స్ట్రక్చర్ పాయింట్లను మ్యాప్ చేసుకోవచ్చని కలెక్టర్ సూచించారు. కేవలం ఒక క్లిక్‌తో సమస్య ఎక్కడుందో త్రీ-డి (3ల) మ్యాప్స్ ద్వారా స్పష్టంగా చూసి, ఆధారాలతో సహా చర్చించవచ్చని కలెక్టర్ వివరించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచుకోవడానికి సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్ క్లిప్పింగులు, డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లను నిరంతరం ఫాలో అవ్వాలని ఇంజినీర్లకు పిలుపునిచ్చారు. ఈ సమీక్షా సమావేశంలో ఇరిగేషన్ శాఖ ఈఈ డి.ఎస్.ప్రదీప్, వివిధ మండలాల డిఈలు, ఏఈలు పాల్గొన్నారు.

# పెంచిన పెట్రోల్ ,డీజిల్, గ్యాస్ , నిత్యావసర వస్తువులు ధరలు తగ్గించాలి



**పార్వతీపురం ఉష శ్రీ జి.ఎస్ ఆర్ మూర్తి జూన్9:-** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన పెట్రోల్, డీజిల్ ,గ్యాస్, నిత్యావసర వస్తువులు ధరలు తగ్గించాలనీ డిమాండ్ చేస్తూ పార్వతీ పురం ఆర్ టి సి కాంప్లెక్స్ వద్ద వామ పక్షాల ఆద్వర్యంలో రాస్తారోకో చేశారు ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం, మోడీ యుద్ధం వచ్చిన తర్వాత పెట్రోల్, డీజిల్ , గ్యాస్ ధరలు పెంచము అని అంటూనే యుద్ధం అనంతరం రోజుకోలాగా పెట్రోల్ ,డీజిల్, గ్యాస్ ధరలు పెంచుతున్నారని వంటగ్యాస్ ధర ఆకాశానికి అంటిందని అన్నారు మోడీ ,కేంద్ర ప్రభుత్వం ట్రంప్ చెప్పినట్లు వినడం వల్ల ట్రంప్ కు లొంగిపోవడం వల్ల ఇరాన్ నుంచి రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకోకపోవడం వలన చమురు ధరలు పెరుగుతున్నాయని అన్నారు అంతర్జాతీయ మార్కెట్లో ధరలు పెరగకపోయినప్పటికీ మన దేశంలో ,రాష్ట్రంలో మాత్రం కార్పొరేట్ పెట్టుబడుదారులకు లాభాలు వచ్చే విధంగా మోడీ ప్రతిరోజు పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలు పెంచుతున్నారని ఈ ధరలు పెరగడం వలన నిత్యవసర వస్తువులు ధరలు వి ఎ రీ త ం గా పెరుగుతున్నాయని పేదలు బ్రతక లేని పరిస్థితి లో ఉన్నారని కాలకృత్యాలు అన్నారు వాణిజ్య వంటగ్యాస్ ధర పెరగడం వలన హోటలలో టిఫిన్లు, భోజనాలు ధరలు విపరీతంగా పెరిగాయని ఈ ధరలు పెరగడానికి కారణం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ పెట్టుబడుదారులతో కొమ్మక్కై కార్పొరేట్ లాభాల కోసం ప్రతిరోజు చమురు ధరలు పెంచుతున్నారని వీటికి వ్యతిరేకంగా ప్రజలంతా నిలబడి పోరాడాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు కుమార్ గారు, పువ్వుల ప్రసాద్ సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి కోల్లి గంగు నాయుడు సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు గొర్లి వెంకటరమణ, రెడ్డి వేణు, కొల్లి సాంబమూర్తి గారు, ఐద్వా జిల్లా కార్యదర్శి బొత్స లక్ష్మి సిఐటియు నాయకులు సూరిబాబు, యువజన నాయకులు పి. రాజశేఖర్, సిపిఐ (ఎం. ఎల్) న్యూ డెమోక్రసీ నాయకులు పి రమణి, రైతు కూలీ సంఘం నాయకులు శ్రీనునాయుడు, ఎం. భాస్కర్ రావు, సిపిఐ (ఎం. ఎల్) లిబరేషన్ నాయకులు పి.సంఘం పాల్గొన్నారు

# విశాఖ ఉక్కు బాధితుల పరామర్శకు మంత్రి నారా లోకేష్ రాకున్నా బాగుండేది

- ప్రాణాలు కోల్పోయింది మీ కుటుంబ సభ్యులు కాదు కదా అని....
- యూనియన్ నాయకులను మంత్రి నారా లోకేష్ ప్రశ్నించడం ఎంతవరకు సబబు?
- తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ డిమాండ్



**విశాఖపట్నం, ఉష శ్రీ:** కింగ్ జార్జ్ ఆసుపత్రిలో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ప్రవర్తనపై తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అసలు ఆయన బాధితులను పరామర్శించేందుకు రాకుండా ఉన్నా బాగుండేదని వ్యాఖ్యానించారు. ఇదే అంశమై ఆయన కింగ్ జార్జ్ ఆసుపత్రి వద్ద మంగళవారం మధ్యాహ్నం మీడియాతో మాట్లాడుతూ.. ఒక వైపు ఆత్మీయులను కోల్పోయి బంధువులు, ఉద్యోగులు తీవ్ర ఆవేదనలో ఉంటే లోకేష్ మాటలు వారిని మరింత ఆవేదనకు గురి చేసాయన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారం పరిరక్షణకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోలేకపోవడం వలనే ప్రమాదం సంభవించిందని పలువురు యూనియన్ నాయకులు లోకేష్ వద్ద ప్రస్తావించగా.. ప్రాణాలు కోల్పోయింది మీ కుటుంబ సభ్యులు కాదు కదా? అని లోకేష్ బాధ్యతా రాహిత్యంగా సమాధానం చెప్పడం సరికాదన్నారు. ఇలాంటి సమాధానాలు చెప్పే కంటే అసలు బాధితుల పరామర్శకు రాకపోవడమే మేలని అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో యూనియన్ నాయకులకు లోకేష్ తక్షణమే క్షమాపణ చెప్పాలని బి.వి.రామ్ డిమాండ్ చేశారు. రాజకీయ నాయకులు ఎంతో ఓర్పు సహనంతో మాట్లాడాలని, ముఖ్యంగా సున్నితమైన సందర్భంగా మరింత అప్రమత్తంగా మాట్లాడాల్సి ఉంటుందన్నారు. కానీ లోకేష్ సున్నితమైన సందర్భాలలో ఎలా మాట్లాడాలో తెలియని అపరిపక్వ స్థితిలో ఉన్నారని ఎద్దేవా చేశారు. నిపుణులైన ఉద్యోగులు లేకపోవడమే విశాఖ ఉక్కు కర్మాగారంలో ప్రమాదానికి ప్రధాన కారణం అని రామ్ ఆరోపించారు. విశాఖ ఉక్కులో నిపుణులైన ఉద్యోగులు లేకపోవడం వల్ల తీవ్రమైన నిర్వహణా లోపం ఏర్పడిందన్నారు. ఫలితంగా భారీ ప్రమాదం సంభవించి.. 8 మంది ప్రాణాలు కోల్పోయారని అనేక మందికి గాయపడ్డారని ప్రస్తావించారు. గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు విశాఖ ఉక్కు కర్మాగారం కోసం పోరాడి న్యాయం చేస్తామని చెప్పిన కూటమి పెద్దలు ఇప్పుడు సంభవించిన ఘోర ప్రమాదానికి ఏం సమాధానం చెబుతారని బి.వి.రామ్ ప్రశ్నించారు.

# బదిలీపై వెళుతున్న పంచాయతీ కార్యదర్శి సాయిరాం రెడ్డికి ఘన సన్మానం





**ఆత్రేయపురం జూన్ 9,ఉష శ్రీ ప్రతినిధి..** ర్యాలి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా సేవలందించిన సాయిరాం రెడ్డి గ్రేడ్-2 కార్యదర్శిగా పదోన్నతి పొంది పిఠాపురం నియోజకవర్గానికి బదిలీ కావడంతో స్థానిక సిబ్బంది ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా పంచాయతీ సిబ్బంది, ఆశా వర్కర్లు, అంగన్వాడీ సిబ్బంది సంయుక్తంగా సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించి శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సాయిరాం రెడ్డి విధి నిర్వహణలో నిబద్ధత, ప్రజల సమస్యల పట్ల చూపిన స్పందన ఆదర్శప్రాయమని కొనియాడారు. గ్రామంలో ఎలాంటి సమస్య ఎదురైనా వెంటనే స్పందించి పరిష్కారానికి కృషి చేసేవారని, ప్రజలు, సిబ్బందితో సత్సంబంధాలు కొనసాగించారని పేర్కొన్నారు. ఆయన పదోన్నతి సాధించడం ఆనందకర విషయమని, కొత్త బాధ్యతల్లో మరింత ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. సన్మానానికి స్పందించిన సాయిరాం రెడ్డి ర్యాలి గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది అందించిన సహకారాన్ని గుర్తు చేసుకుంటూ అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. తన సేవా కాలంలో అందరి సహకారంతోనే అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతంగా అమలు చేయగలిగానని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు పెండెం వెంకన్న, పాలింగి రవిచంద్ర, గార్లపాటి గోపాలకృష్ణమూర్తి, బందెల గురవయ్య, మాజీ సర్పంచ్ కొడమంచిలి లక్ష్మి, పంచాయతీ సిబ్బంది, ఆశా వర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా సవరణలో ప్రతి కార్యకర్త బాధ్యతగా పనిచేయాలి

### అర్హులైన ఒక్క ఓటరు కూడా ఓటు హక్కు కోల్పోకూడదు: ఎమ్మెల్యే బండారు సత్యానందరావు.

**కొత్తపేట జూన్ 9, ఉష శ్రీ ప్రతినిధి..** ఎన్నికల కమిషన్ చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్--ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పిలుపునిచ్చారు. మంగళవారం కొత్తపేటలోని కాపు కళ్యాణ మండపంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, బూత్ లెవెల్ ఏజెంట్లకు నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన పాల్గొని మార్గనిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై ప్రతి కార్యకర్త పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. బూత్ కమిటీ ఇన్‌చార్జులు, బీఎల్ఏలు తమ పరిధిలోని ఓటర్ల జాబితాలను క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన ప్రతి ఒక్కరి పేర్లు నమోదయ్యేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రతి ఓటరు నుంచి ఫారం-2ను సక్రమంగా పూర్తి చేయించి సమర్పించేలా చూడాలని, పార్టీ కార్యకర్తలు, సానుభూతిపరుల ఓట్లు అనవసరంగా తొలగించ బడకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. అర్హులైన ఒక్క ఓటరు కూడా తన ఓటు హక్కును కోల్పోకుండా అందరూ బాధ్యతతో పనిచేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం ఎన్నికల ప్రక్రియలో అత్యంత కీలకమైందని, ప్రజాస్వామ్య బలోపేతానికి ఇది దోహదపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జులు, కో-ఇన్‌చార్జులు, యూనిట్ ఇన్‌చార్జులు, యూనిట్ కో-ఇన్‌చార్జులు, బూత్ లెవెల్ ఏజెంట్లు తదితరులు పాల్గొన్నారు.



## ఓటర్ల జాబితా సవరణపై అప్రమత్తంగా ఉండాలి



### అర్హులైన ఒక్క ఓటరు కూడా ఓటు హక్కు కోల్పోకూడదు. - ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

**రావులపాలెం, జూన్ 9, ఉష శ్రీ** ఎన్నికల కమిషన్ చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్--ఎస్ఐఆర్) కార్యక్రమంపై ప్రతి నాయకుడు, కార్యకర్త పూర్తి అవగాహన కలిగి ఉండాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పిలుపునిచ్చారు. మంగళవారం రావులపాలెంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, బూత్ లెవెల్ ఏజెంట్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ప్రజాస్వామ్య వ్యవస్థకు అత్యంత కీలకమైందని పేర్కొన్నారు. ఓటర్ల జాబితాలను క్షుణ్ణంగా పరిశీలించి అర్హులైన ప్రతి ఒక్కరిని నమోదు చేయడంతో పాటు, అవసరమైన ఫారం--2ను సక్రమంగా పూర్తి చేసి సమర్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, సానుభూతిపరుల ఓట్లు అనవసరంగా తొలగించబడ కుండా అప్రమత్తంగా ఉండాలని, అర్హులైన ఒక్క ఓటరు కూడా తన ఓటు హక్కును కోల్పోకుండా బూత్ లెవెల్ ఏజెంట్లు ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఎన్నికల కమిషన్ నిబంధనలకు అనుగుణంగా ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్ల వివరాలను ధ్రువీకరించాలని, కొత్తగా అర్హత పొందిన యువతను ఓటర్ల జాబితాలో నమోదు చేయించేందుకు కృషి చేయాలని కోరారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను విజయవంతం చేయడంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటు హక్కు కీలకమని, ప్రతి అర్హుడికి ఆ హక్కు అందేలా చర్యలు తీసుకోవడం అందరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ సమావేశంలో క్లస్టర్ ఇన్‌చార్జులు, కో-ఇన్‌చార్జులు, యూనిట్ ఇన్‌చార్జులు, యూనిట్ కో-ఇన్‌చార్జులు, బూత్ లెవెల్ ఏజెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## లగ్జరీ హౌసింగ్ లో సరికొత్త అధ్యాయం



**హైదరాబాద్ :** హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగంలో ఓ సరికొత్త, ప్రతిష్ఠాత్మక అధ్యాయం మొదలైంది. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన 'ట్రంప్ టవర్స్' బ్రాండ్ ఇప్పుడు అధికారికంగా భాగ్యనగరంలోకి అడుగుపెట్టింది. రంగారెడ్డి జిల్లా, గండిపేట మండలం పరిధిలోని కోకాపేటలో నిర్మించనున్న ఈ అల్ట్రా లగ్జరీ నివాస ప్రాజెక్టుకు తెలంగాణ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (౧+=జు=ూ) అధికారికంగా ఆమోదముద్ర వేసింది. దీంతో నగరంలో అత్యంత ఖరీదైన, విలాసవంతమైన నివాస సముదాయాల నిర్మాణానికి మార్గం సుగమమైంది. టీజీ రెరా వెల్లడించిన వివరాల ప్రకారం, ఈ ప్రాజెక్టును 'ఇరా ది ఎడ్జ డెవలపర్స్ ఎల్ఎల్‌పీ' సంస్థ అభివృద్ధి చేయనుంది. దీనికి ౹ా02400010871 నంబర్‌తో రిజిస్ట్రేషన్ లభించింది. ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) వెంబడి ఉన్న కోకాపేట "గోల్డెన్ మైల్" ప్రాంతంలో 16,389.76 చదరపు మీటర్ల (సుమారు 4 ఎకరాలు) విస్తీర్ణంలో ఈ నిర్మాణం చేపట్టనున్నారు. మొత్తం 2,64,580 చదరపు మీటర్ల బిల్ట్-అప్ ఏరియాకు అనుమతులు లభించాయి. ప్రాజెక్ట్ పూర్తి చేయడానికి 2031 మే 15ని గడువుగా నిర్దేశించారు. ఈ ప్రాజెక్టును ట్రంప్ ఆర్గనైజేషన్ యొక్క భారత అధికారిక భాగస్వామి అయిన 'ట్రైబెకా డెవలపర్స్' మరియు 'ఇరా రియల్టీ' సంస్థలు సంయుక్తంగా అభివృద్ధి చేస్తున్నాయి. ఇందులో భాగంగా ఆకాశాన్ని తాకేలా రెండు భారీ టవర్లను (జంట టవర్లు) నిర్మించనున్నారు. కొన్ని నివేదికల ప్రకారం, ఈ టవర్లు 63 అంతస్తులకు పైగా ఉండవచ్చని అంచనా. ప్రధానంగా అత్యంత సంపన్నులను లక్ష్యంగా చేసుకుని 3, 4, 5 బీహెచ్‌కే కాన్ఫిగరేషన్‌లతో కూడిన ప్రీమియం అపార్ట్‌మెంట్లను ఇందులో అందుబాటులోకి తేనున్నారు. సుమారు రూ.3,500 కోట్ల అంచనా వ్యయంతో ఈ ప్రాజెక్టును నిర్మిస్తున్నట్టు తెలుస్తోంది. ట్రంప్ బ్రాండ్ అనగానే గుర్తొచ్చే ప్రత్యేకమైన డిజైన్, ప్రపంచ స్థాయి సదుపాయాలు ఈ ప్రాజెక్టులో ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. ప్రైవేట్ ఎలివేటర్లు, రెండు టవర్లను కలిపే స్కై బ్రిడ్జ్‌లు, అత్యున్నత ప్రమాణాలతో కూడిన క్లబ్‌హౌస్ వంటి ఎన్నో ప్రత్యేకతలు ఇందులో ఉండనున్నాయి. హైదరాబాద్‌లో లగ్జరీ నివాసాలకు పెరుగుతున్న డిమాండ్‌కు ఈ ప్రాజెక్ట్ అద్దం పడుతోంది. ఇప్పటికే దేశంలోని ఇతర ప్రధాన నగరాల్లో ట్రంప్ టవర్స్ విజయవంతం కాగా, ఇప్పుడు హైదరాబాద్ వంతు వచ్చింది. ఈ ప్రాజెక్టుల ప్రారంభోత్సవం కోసం త్వరలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తనయులు డొనాల్డ్ ట్రంప్ జూనియర్, ఎరిక్ ట్రంప్ భారత్‌లో పర్యటించే అవకాశాలు ఉన్నాయని కూడా ప్రచారం జరుగుతోంది. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే, హైదరాబాద్ స్కైలైన్‌లో ఇది ఒక ఐకానిక్ ల్యాండ్‌మార్క్‌గా నిలిచిపోవడం ఖాయం.

## ఇండికేటర్లు తప్పనిసరిగా ఉపయోగించాలి; సీఐ రామకోటయ్య



**గిద్దలూరు ఉష శ్రీ జూన్ 09:-** గిద్దలూరు రూరల్ సీఐ రామకోటయ్య ఆటో డ్రైవర్లకు కీలక సూచనలు చేశారు. మూలమలుపులు తిరిగేటప్పుడు తప్పనిసరిగా ఇండికేటర్లు ఉపయోగించాలని, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని విజ్ఞప్తి చేశారు. ఇటీవల రోడ్డు ప్రమాదాలు అధికమవుతున్న నేపథ్యంలో, వాటి నివారణకు ఆటో డ్రైవర్లు కృషి చేయాలని, తమ వద్ద ఆటో సంబంధిత ధ్రువపత్రాలతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని సీఐ తెలిపారు. ఇండికేటర్లు వాడటం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని ఆయన సూచించారు.

## సమాజ అభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకం - మార్కాపురం శాసనసభ్యులు శ్రీ కందుల నారాయణ రెడ్డి



**మార్కాపురం ఉష శ్రీ జూన్ 09;-** మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణ రెడ్డి మార్కాపురం పట్టణంలోని జడ్పీ బాయ్స్ హై స్కూల్ లో జరుగుతున్న ప్రభుత్వ ఉపాధ్యాయులకు ప్రభుత్వం నిర్వహిస్తున్న ఫౌండేషన్ లీటరసీ న్యూమరసి శిక్షణ తరగతులకు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒకటి మరియు రెండవ తరగతుల విద్యార్థులకు బోధించే ఉపాధ్యాయులకు ఈ శిక్షణ తరగతులు ఎంతగానో దోహదపడతాయని తద్వారా 1,2 తరగతి విద్యార్థులకు ఆటపాటలతో కూడిన విద్యను అందించవచ్చు అని అన్నారు. మార్కాపురం నియోజకవర్గంలో గొట్లగట్టు జడ్పీ హైస్కూల్ విద్యార్థి 592 మార్కులు సాధించి ప్రభుత్వ పాఠశాలల సత్తా చాటారని ఆ స్కూల్ హెడ్మాస్టర్ కి ఈనెల 19వ తేదీ జరగనున్న మెగా పేరెంట్స్ డే మీటింగ్ రోజున లక్ష రూపాయలు ప్రోత్సాహంగా అందజేస్తానని అన్నారు. అదేవిధంగా 580 మార్కులు దాటిన వారికి కూడా ఆ స్కూలుకు వెళ్లి త్వరలో ప్రోత్సాహక బహుమతులు అందజేస్తానని అన్నారు. సమాజ అభివృద్ధిలో ఉపాధ్యాయులు పాత్ర ఎంతో కీలకమని మంచి విద్యను అందించడం ద్వారా విద్యార్థులను ఉన్నత స్థానాల్లో నిలబెట్టవచ్చునని తద్వారా వారు ఈ ప్రాంత అభివృద్ధికి దోహదపడతారని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## అడవి పంది ఢీకొని వ్యక్తి మృతి



**మార్కాపురం జిల్లా కంభం మండలం:-** ప్రకాశం జిల్లా మార్కాపురం డివిజన్‌లోని కంభం మండలం నల్లకాలువ గ్రామ సమీపంలో విషాదం చోటుచేసుకుంది. రోడ్డుపైకి అకస్మాత్తుగా వచ్చిన అడవి పందిని బైక్ ఢీకొట్టడంతో గిద్దలూరు మండలం కృష్ణంశెట్టిపల్లె గ్రామానికి చెందిన బూపాని తిరుమలయ్య (44) తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే ఆయనను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలుకు తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో తిరుమలయ్య మృతి చెందినట్లు కంభం మండలం ఎస్సై శివకృష్ణారెడ్డి తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు. తిరుమలయ్య మృతితో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు విషాదంలో మునిగిపోయారు.

## చరిత్ర సృష్టించనున్న మోడీకి అభినందనలు



**గిద్దలూర ఉష శ్రీ జూన్ 09:-** భారత ప్రధాన మంత్రిగా శ్రీ నరేంద్ర మోడీ చరిత్ర సృష్టించబోతున్నారు. ఎక్కువకాలం ప్రధాన మంత్రిగా పనిచేసిన ఆధిక్యత ఆయన అందుకోబోతున్నారు ప్రధానమంత్రిగా నెహ్రూ పేరిట ఉన్న రికార్డును ఆయన బ్రేక్ చేయనున్నారు. భారత తొలి ప్రధాని జవహర్లాల్ నెహ్రూ 1952 మే 13న బాధ్యతలు చేపట్టి 1964 మే 27 వరకు అంటే 4398 రోజులు ఆ పదవిలో కొనసాగారు. అయితే ఆ రికార్డును ప్రస్తుత ప్రధాని మోడీ బద్దలు కొట్టబోతున్నారు 2014 మే 26న మోడీ తొలిసారిగా ప్రధాని బాధ్యతలు చేపట్టి ప్రస్తుతం మూడవ దశ ప్రధానిగా కొనసాగుతున్నారు అంటే ఈ లెక్కన ఈనెల పదవ తేదీకి ఆయన 4399 రోజులు ప్రధానిగా కొనసాగుతున్నట్లు లెక్క..... ఈ ప్రకారం పరిశీలిస్తే ప్రధాని మోడీ దేశ ప్రధానిగా ఎక్కువ కాలం పనిచేసి చరిత్ర తిరగరాయబోతున్నారు ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీకి గిద్దలూరు పట్టణ బిజెపి అధ్యక్షులు అప్పిశెట్టి ఉదయ శంకర్ అభినందనలు తెలియజేశారు భవిష్యత్తులో వచ్చే టైం లో కూడా ప్రధానిగా బాధ్యతలు చేపట్టి దేశంలో ఏ ప్రధాని సాధించలేని ఘనతను ఆయన సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు ఉదయ శంకర్ తెలిపారు

### పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల పెరుగుదలపై బగ్గుమన్న ప్రజాసంఘాలు



**మార్కాపురం ఉష శ్రీ జూన్ 09:-** మార్కాపురం జిల్లా కేంద్రంలో సిపిఐ సిపిఎం ఆధ్వర్యంలో పెరిగిన పెట్రోల్ డీజిల్ నిత్యవసర ధరల పెంపుకు వ్యతిరేకంగా రాస్తారోకో చేశారు. సిపిఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణ, సిపిఎం జిల్లా కార్యదర్శి సోమయ్య ఇరువురు నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బడా కార్పొరేట్ కంపెనీలకు పనులు తగ్గించి పెట్రోల్ డీజిల్ ధరలపై పన్నుల రూపంలో సాధారణ ప్రజల నుండి గుంజుకుంటున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 31 శాతం పన్నుతో పాటు నాలుగు రూపాయలు వ్యాట్ ను, లీటర్ కి ఒక రూపాయి చొప్పున రోడ్డు పన్ను వసూలు చేస్తూ దేశంలోనే అత్యంత అధిక పన్ను వసూలు చేస్తుందని అన్నారు. అలాగే డీజిల్ రేటు పెంపుదల ఫలితంగా రవాణా చార్జీలు పెరిగి అన్ని నిత్యవసర ధరలు పెరుగుతున్నాయి అన్నారు. కేంద్ర రాష్ట్ర ల పన్నుల భారాలు తగ్గించాలి, ప్రభుత్వాలు పెట్రోల్ డీజిల్ ధరలను తక్షణమే తగ్గించాలన్నారు.

PRINTED, PUBLISHED, OWNED BY ILIPILLA MOHAN, D.NO: 6-11-2, KILARI APPALASWAMI STREET, NAGA LAKSHMI NILYAM, ANJANEYAVAGUSENTAR, VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH- 520001, PRINTED AT GANTYADA APPA RAO D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH-523001 P.H: 92950 03377,EMAIL: ushasri2025@gmail.com,RNI NO: APTEL/25/A4894,EDITOR: ILLIPILLA MOHAN